

# పోలీసు కాల్పులు

## చట్టం - ఆచరణ

ఆంధ్రప్రదేశ్
పౌరహక్కుల సంఘం
(APCLC)

పోలీసు కాల్పులు : చట్టం-ఆచరణ

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం
(APCLC)

ముద్రణ : ఏప్రిల్, 1991

ప్రతులు : 3000

వెల : 3 రూపాయలు

ముద్రణ :
చైతన్య ప్రింటర్స్, విజయవాడ-2

ప్రతులకు :
ఎస్. ఎస్. సి. బోస్
డా॥ రామనాథం ఛాంబర్ ఆఫ్ లా
పెద్దిబొట్లవారి వీధి,
గవర్నరుపేట,
విజయవాడ-520 002

# పోలీసు కాల్పులు : చట్టం, ఆచరణ

'పోలీసులకు తుపాకులిచ్చింది ఎందుకు— కాల్పులు జరపడానికి కాకపోతే' అని అమాయకంగా ప్రశ్నించే దశ నుండి విచ్చలవిడిగా జరుగుతున్న పోలీసుకాల్పులను ప్రశ్నించేదాకా ప్రజలు ఎదిగారు. 'తుపాకీ తూటాకు చట్టం తెలుస్తుందా' అని అహంకారంగా జవాబుచెప్పే దశనుండి నిజమో అబద్ధమో ఒక కథ అల్లే స్థితికి పోలీసులూ ఎదిగారు.

తూటాకు చట్టం తెలీదు. కానీ దాన్ని కాల్చేవాడికి తెలియాలి. తూటాకు నియమాలుండవు. కానీ దాన్ని కాల్చేవాడికి నియమాలుంటాయి. ఆ చట్టాన్నీ నియమాలనూ అలక్ష్యంచేస్తే దానికి శిక్ష ఉండాలి.

ఈమధ్యకాలంలో రాష్ట్రంలో పోలీసు కాల్పులు చాలా విరివిగా జరుగుతున్నాయి. లాకప్పు మరణాలూ, 'ఎన్‌కౌంటర్లు' ఎంత తరచుగా జరుగుతున్నాయో ఇప్పుడు పోలీసు కాల్పులలో మరణాలూ అంతే తరచుగా సంభవిస్తున్నాయి. ఈ కాల్పులకొక చట్టం లేదా? దానిని అతిక్రమించి కాల్పులు జరిపితే శిక్షలేదా? చట్టం ఉంది. అన్ని చట్టాలలాగా దీనిలో కూడా ప్రజానుకూలమయిన అంశం కొంచెం, ప్రజావ్యతిరేకమయినది దండిగాను వుంది. ఆ కొంచెంకూడ అమలుకావడంలేదు కాబట్టి దాని వివరాలను తెలుసుకోవాలి.

అక్కడితో ఆగిపోకుండ, ఏ సామాజిక పరిస్థితులలో ఈ కాల్పులు పెరుగుతున్నాయో గమనించాలి. పోలీసు అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయంటే పోలీసులు రోజురోజుకూ చెడ్డవాళ్ళవుతున్నారని కాదు. ప్రజల జీవితంలో ఒకవైపు సంక్షోభం పెరగడం, ప్రజాచైతన్యం పెరగడం, మరొకవైపు పరిపాలక వ్యవస్థ మరింత అప్రజాస్వామికంగా తయారుకావడం ఇవాళ మన ముందున్న సామాజిక వాస్తవం. ఈ పరిస్థితులే పెరుగుతున్న అణచివేతకు మూలం.

## బలప్రయోగం :

సామాజిక శాంతిభద్రతలను కాపాడడానికీ, కొన్నిరకాల నేరాలను నిరోధించడానికీ బలప్రయోగంచేసే అధికారం పోలీసులకు చట్టం ఇస్తుంది.

### (i) శాంతిభద్రతల సంరక్షణ :

నేరవిచారణస్మృతి (Cr. P.C.) 10వ అధ్యాయంలో సామాజిక శాంతి

భద్రతల నిర్వహణకు సంబంధించిన అధికారాలూ, నియమాలూ పొందుపరచబడి ఉన్నాయి.

నలుగురికంటే ఎక్కువమంది ఒకచోట గుమిగూడితే, ఆ సమావేశం చట్టవ్యతిరేక సమావేశమయినా, లేక సామాజిక శాంతికి భంగం కలిగించేటట్లున్నా, ఆ సమావేశాన్ని వెంటనే చెదిరిపొమ్మని ఆదేశం ఇచ్చే అధికారం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటుకు, పోలీస్ స్టేషన్ అధిపతికి, ఎస్.ఐ. హోదాకు తక్కువకాని పోలీస్ ఆఫీసర్‌కు ఉందని సెక్షన్ 129(1) అంటుంది.

చెదిరిపొమ్మని చెప్పగానే చెదిరిపోకున్నా, లేక వాళ్ళు చెదిరిపోయేటట్టు లేరని ముందే ఆ అధికారికి అనిపించినా బలప్రయోగం ద్వారా చెదరగొట్టే అధికారం వారికి ఉందనీ, ఆ చర్యకు సహాయం చేయవలసిందిగా ఆ స్థలంలోవున్న ఏ మగవాడినయినా అడిగే అధికారం వుందనీ, 129(2) అంటుంది.

'చట్టవ్యతిరేక సమావేశాల'నే కాక, 'సామాజిక శాంతికి భంగం కలిగించే' సమావేశాలను కూడ బలప్రయోగం ద్వారా చెదరగొట్టవచ్చుననడంలో సెక్షన్ 129 పోలీసులకు చాలా విస్తృతమయిన అధికారం ఇస్తుంది. ఎందుకంటే చట్టవ్యతిరేకమయిన సమావేశం (unlawful assembly) అనేదానికి నేరస్మృతిలో పరిమితమయిన అర్థం ఉంది. నలుగురికంటే ఎక్కువమంది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుగానీ చట్టసభలనుగానీ విధినిర్వహణలో నిమగ్నమైన ప్రభుత్వ ఉద్యోగినిగానీ బలప్రయోగంతో లొంగదీసుకునే ఉమ్మడి లక్ష్యంతో; లేక చట్టం అమలును ధిక్కరించే ఉమ్మడి లక్ష్యంతో; లేక భూమి దురాక్రమణకుగానీ ఆస్తులకు నిప్పుపెట్టడానికిగానీ ఇతర నేరాలకుగానీ పాల్పడే ఉమ్మడి లక్ష్యంతో; లేక బలప్రయోగంతో ఒకరి ఆస్తినిగానీ ఇతర హక్కులనుగానీ స్వాధీనపరచుకునే ఉమ్మడి లక్ష్యంతో; లేక ఎవరిచేతనయినా బలవంతంగా చట్టవ్యతిరేకమయిన పనులు చేయించే ఉమ్మడి లక్ష్యంతో; ఒకచోట గుమిగూడితే అది 'చట్ట వ్యతిరేక సమావేశం' అవుతుంది.

కాబట్టి పోలీసులు ఒక జనసమూహంమీద కాల్పులు జరిపి, చట్టవ్యతిరేక సమావేశాన్ని చెదరగొట్టడానికి బలప్రయోగానికి పాల్పడ్డామని చెప్పాలంటే ఆ సమావేశంలో వున్నవారందరికీ పైన పేర్కొన్న ఏదో ఒక నేరంచేసే ఉద్దేశ్యం ఉమ్మడిగా ఉందని రుజువుచేయవలసి ఉంటుంది. ఉద్దేశ్యం ఒకరిలో ఉంటే చాలదు, అది ఉమ్మడి ఉద్దేశ్యం కావాలని చట్టం స్పష్టంగా అంటుంది. ఈ దేశంలో జనాన్ని అదుపులోపెట్టడానికి ఈ అధికారం చాలదనుకున్నారేమో, చట్టవ్యతిరేక సమావేశాలనేకాక, సామాజిక శాంతికి భంగం కలిగించే (నలుగురికంటే ఎక్కువ ఉండే)

ఏ సమావేశాన్నయినా చెదరగొట్టవచ్చునని రాశారు. సామాజిక శాంతికి భంగం కలిగించడం అనేది చాలా అస్పష్టమయిన మాట కాబట్టి ప్రజలమీద చీటికీమాటికీ బలప్రయోగంచేసే అధికారం సెక్షన్ 129 ద్వారా పోలీసులకు సంక్రమించింది. పైగా, చెదిరిపొమ్మని చెప్పినా వినకపోతేనే కాదట, చెప్పినా వినరని ముందే అనిపిస్తే చెప్పకుండానే బలప్రయోగానికి పాల్పడవచ్చునట!

ఇంత అపరిమితమయిన అధికారంలో కూడ రెండు పరిమితులు వెంటనే కనిపిస్తాయి :

(i) నలుగురుకానీ అంతకంటే తక్కువకానీ ఉన్న సమావేశానికి ఈ అధికారం వర్తించదు.

(ii) ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, పోలీస్‌స్టేషన్ అధికారి, లేక కనీసం ఎస్.ఐ. హోదా కలిగిన అధికారి కాక వేరే ఎవ్వరూ బలప్రయోగానికి పాల్పడడానికి వీలులేదు.

ఇద్దరు ముగ్గురిమీద సహితం కాల్పులు జరిపిన సంఘటనలు, కానిస్టేబుళ్ల స్వంత నిర్ణయంమీద కాల్పులకు పాల్పడిన సంఘటనలూ అనేకం ఉన్నాయి. ఈ పుస్తకంలో గత ఏణ్ణర్థంలో రాష్ట్రంలో జరిగిన అన్ని పోలీసుకాల్పుల రిపోర్టులూ ఉన్నాయి. వాటిలో ఈ కోవకు చెందినవి చాలా ఉన్నాయి. ఆ కాల్పులను పోలీసులు ఏ చట్టం కింద సమర్థించుకుంటారో తరువాత చూద్దాం.

ఏ అధికారమయినా తన లక్ష్యాన్ని సాధించేంత మేరకే ప్రయోగించాలి. అంటే సమావేశాన్ని చెదరగొట్టే అధికారాన్ని చెదరగొట్టేందుకు మట్టుకే వినియోగించాలి, చంపడానికి కాదు. చెదరగొట్టడానికి కావలసిన కనీస బలప్రయోగం మట్టుకే చేయాలి, అంతకంటే ఎక్కువకాదు. ఈ విషయం నాగరిక అధికారంలో ఎప్పుడూ అంతర్లీనంగా ఉండనే ఉంటుంది. దానిని వాచ్యంగా పేర్కొనవలసిన అవసరంలేదు.

బలప్రయోగం తన లక్ష్యానికి అవసరమయినమేరకు మాత్రం జరగాలంటే దానికి కొన్ని నియమాలను నిర్దేశించాలి. లేకపోతే దాని పరిమాణం ప్రయోగించే మనిషి ఇష్టానుసారం ఉండే ప్రమాదం ఉంటుంది. ఆ నియమాలు నేర విచారణస్మృతిలో లేవుకానీ పోలీసు వ్యవస్థ నియమావళి అయిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్ (సాధారణ ఆదేశాలు)లో ఉన్నాయి. బ్రిటిష్ హయాంలో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో రూపొందించిన మద్రాస్ పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్ ఇప్పుడు కొత్త పేరుతో మన రాష్ట్ర పోలీసులకు వర్తిస్తాయి. ఆర్డర్ నెం. 885

సమావేశాలను చెదరగొట్టేందుకు పోలీసులు పాటించవలసిన క్రమాన్ని వివరంగా చెప్తుంది. అందులోని ముఖ్యాంశాలు ఇవి :

(అ) సామాజిక శాంతికి భంగం వాటిల్లగలదని భావించినప్పుడు పోలీసులు తప్పనిసరిగా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్*ను పిలిపించాలి.

(పోలీసులు అసలెప్పుడూ మేజిస్ట్రేట్‌ను పిలిపించరని క్రిందవున్న రిపోర్టులను చదివితే తెలుస్తుంది.)

(ఆ) మేజిస్ట్రేటు వచ్చిన తర్వాత అతని ఆధ్వర్యంలోనే కార్యక్రమం నడవాలి.

(ఒకవేళ మేజిస్ట్రేటు రావడం అంటూ జరిగినా అతను పోలీసుల ఆధ్వర్యంలో నడుచుకుంటాడు తప్ప అతని ఆదేశానుసారం పోలీసులు నడుచుకోరని రిపోర్టులు చదివితే తెలుస్తుంది.)

(ఇ) సమావేశం అధికారుల ఆజ్ఞకు తలఒగ్గని పరిస్థితిలో, లాఠీఛార్జి, బాష్పవాయు ప్రయోగాలు కూడ పనిచేయకపోతే అప్పుడు కాల్పులు జరపవచ్చును. సమావేశాన్ని చెదరగొట్టడానికి బలప్రయోగం ఏ దశలో ఉపయోగించాలి, ఏ రకమయిన బలప్రయోగం చేయాలి అనే విషయాలు మేజిస్ట్రేట్ నిర్ణయించాలి.

(బాష్పవాయువు ఏ పోలీస్ స్టేషన్‌లోనూ ఉండదు. లాఠీఛార్జి అప్పుడప్పుడు చేస్తారుగానీ లాఠీఛార్జి లేకుండా నేరుగా కాల్పులు జరిపిన సంఘటనలే ఎక్కువ. ఏ రకమయిన బలప్రయోగం చేయాలనే నిర్ణయం పోలీసులే స్వయంగా తీసుకుంటారు — అసలు మేజిస్ట్రేట్‌ను పిలిస్తేకదా!)

(ఈ) ఏ రకమయిన బలప్రయోగానికి పాల్పడాలో మేజిస్ట్రేటు నిర్ణయించిన తరువాత, ఎంత బలప్రయోగం చేయాలో, ఏవిధంగా చేయాలో పోలీస్ అధికారి నిర్ణయించాలి. అయితే అవసరం అయినదానికంటే ఎక్కువ బలప్రయోగం చేయకూడదన్న సూత్రాన్ని గుర్తుంచుకోవాలి.

(కనీస బలప్రయోగం సూత్రంకాక అత్యధిక బలప్రయోగ సూత్రాన్ని పోలీసులు పాటిస్తారని రిపోర్టులు చదివితే తెలుస్తుంది.)

(ఉ) పోలీసులకు ఆదేశాలన్నీ కూడ ఇన్‌ఛార్జి అధికారి నుండే రావాలి. ఆదేశం లేకుండ కాల్పులు జరపరాదు.

---

* మండల రెవెన్యూ అధికారి లేక అంతకంటే ఎక్కువ హోదాగల రెవెన్యూ అధికారి. ఈ వ్యాసంలో 'మేజిస్ట్రేట్' అంటే ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అనే అర్థంచేసుకోవాలి.

(ఏ ఆదేశమూ లేకుండ ఎవరో ఒకరు కాల్పులు ప్రారంభించడం, అధికారులు ఆ తరువాత దానిని సర్దిచెప్పడం పరిపాటి.)

(డి) లాఠీచార్జిగానీ, బాష్పవాయువుగానీ, కాల్పులుగానీ ప్రయోగించే ముందు పోలీస్ అధికారి ప్రజలకు సంపూర్ణమయిన హెచ్చరిక ఇవ్వాలి. స్పష్టంగా నిర్దిష్టంగా హెచ్చరించాలి. కాల్పులకు పాల్పడితే ప్రమాదం ఉండగలదని వీలయినంత సమర్థంగా వివరించాలి. ఎప్పుడు కాల్పులు జరిపినా హెచ్చరిక మైక్ ద్వారా ఇవ్వాలి. పోలీస్ వాహనాలకు మైక్‌లు ఉండాలి.

(మైక్‌లు ఉండవు. హెచ్చరిక చేయరు. ఎప్పుడూ అకస్మాత్తుగానే కాల్పులు జరుపుతారు.)

(ఎ) హెచ్చరించడం అయిన తరువాత కూడ జనం చెదిరిపోకపోతే అప్పుడు కాల్పులు జరపవచ్చును. ఎన్ని రౌండ్లు కాల్చాలో, ఎవరు కాల్చాలో పోలీస్ అధికారి స్పష్టంగా చెప్పాలి. అవసరం తీరిపోగానే కాల్పులు ఆపేయాలి. గుంపు చెదిరిపోయే లక్షణాలు కనిపించగానే అవసరం తీరిపోయినట్లు లెక్క. కాల్పులు వీలయినంత దూరం నుండి జరపాలి.

(కొందరు చచ్చిపోయి మిగిలినవాళ్ళంతా పారిపోయేదాకా కాల్పులు జరపడం పరిపాటి. పారిపోతున్నవాళ్ళను తరిమి తరిమి కాల్చిన సంఘటనలు బోలెడు.)

(ఏ) ముందు గుంపుకు నాయకులయినవాళ్ళను అరెస్టు చేయాలి. అప్పటికీ గుంపు చెదిరిపోకపోతేనే బలప్రయోగం చేయాలి.

(ఇది ఎప్పుడోగానీ జరగదు. నేరుగా కాల్పులకు దిగడమే పోలీసుల అలవాటు.)

(ఐ) ఎట్టి పరిస్థితిలోనూ గాలిలోకి కాల్పులు జరపకూడదు. జనం తలల మీదికిగానీ శరీరం పైభాగానికిగానీ కాల్పులు జరపకూడదు. క్రిందికి గురిచూసి కాల్చాలి. గుంపులో ఎక్కువ అల్లరిచేస్తున్నవాళ్ళవైపు కాల్చాలి.

(కాల్పులలో చనిపోయేవాళ్ళకు గాయాలు ఎప్పుడూ కూడ తలలో, ఛాతీలో, కడుపులో ఉంటాయి. అల్లరికి పాల్పడ్డవాళ్ళుకాక, అమాయకులు చనిపోవడం పరిపాటి.)

ఈ నియమాలన్నీ కూడ స్టాండింగ్ ఆర్డర్ 885(1)లో ఉన్నాయి.

వీటిని పోలీసులు ఎప్పుడూ పాటించరని తెలుసుకున్న తరువాత సహజంగానే ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఈ నియమాలను పాటించని పోలీసులు

చట్టవ్యతిరేకమయిన కాల్పులు కావా? అప్పుడు ఆ కాల్పులలో ఎవరయినా చనిపోతే అది హత్యకాదా?

భారత రాజ్యాంగంలోని అధికరణం 21 జీవించే హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తిస్తుంది. న్యాయసమ్మతం, నిష్పాక్షికం, హేతుబద్ధం అయిన చట్టం నిర్దేశించే పద్ధతిలో తప్ప ప్రాణాన్ని తీసుకునే అధికారం వీలులేదు. స్టాండింగ్ ఆర్డర్స్‌లో పేర్కొన్న నియమావళి లేకపోతే, సెక్షన్ 129 ఇచ్చే అధికారం విచ్చలవిడి అధికారమే కాగలదు. అది న్యాయసమ్మతంకాదు, హేతుబద్ధంకాదు. ఈ రకంగా చూస్తే ఈ నియమావళిని అతిక్రమించి జరిపే కాల్పులన్నీ హంతక చర్యలే.

పోలీసులు మట్టుకు ఈ స్టాండింగ్ ఆర్డర్స్ సంస్థాంతర్గత ప్రవర్తనా నియమావళి మాత్రమేనని, వాటిని అతిక్రమిస్తే నేరంకాదనీ వాదిస్తూ వున్నారు. కోర్టులు పోలీసు వ్యవస్థకు సంబంధించిన అన్ని విషయాలలాగే ఈ విషయంలో కూడ నిర్ద్వంద్వమయిన వైఖరి తీసుకోవడంలేదు. బదిలీలహా, బందోబస్తు డ్యూటీకి సంబంధించిన స్టాండింగ్ ఆర్డర్స్ సంస్థాంతర్గత ప్రవర్తనా నియమావళి కావచ్చునేమోగానీ పౌరుల ప్రాణాలకు సంబంధించిన ఆర్డర్ 885 కూడ సంస్థాంతర్గత విషయమే ఎట్లా అవుతుంది?

మొత్తానికి సి ఆర్.పి.సి. 129 నుండి సంక్రమించిన బలప్రయోగ అధికారంతో పోలీసు కాల్పులను సమర్థించుకోవడంలో చాలా ఇబ్బందులే ఉన్నాయి. అందువల్లనే క్రింద యిచ్చిన ఏ రిపోర్టులోనూ సామాజిక భద్రతను కాపాడడం కోసం కాల్పులకు పాల్పడ్డామని పోలీసులు సమర్థించుకోవడం కనబడదు. ప్రాణ రక్షణ కోసం, ఆస్తిరక్షణ కోసం కాల్పులు జరిపామని సమర్థించుకోవడం నేర్చు కున్నారు. దీనికి సంబంధించిన చట్టాన్ని పరిశీలిద్దాం.

### (ii) ప్రాణరక్షణ, ఆస్తిరక్షణ :

కొన్నిరకాల నేరాలను నిరోధించడానికి ఎదురుదాడి చేసే హక్కు చట్టంలో ఉంది. భారత శిక్షాస్మృతి (IPC) సెక్షన్ 100 ప్రకారం ఒక వ్యక్తి హత్య, అపహరణ, లైంగిక అత్యాచారం మొదలైన నేరాలకు పాల్పడబోతోంటే దానిని నిరోధించడానికి ఆ వ్యక్తిపైన దాడిచేసే హక్కు ఎవరికైనా ఉంటుంది. ఈ ఎదురుదాడిలో ఆ వ్యక్తి ప్రాణాలు కూడా పోవచ్చు. పైన పేర్కొన్న నేరాలు కాకుండా వేరే ఏవైనా భౌతికదాడికి సంబంధించిన నేరాన్ని నిరోధించే ఎదురుదాడి ఆ వ్యక్తి ప్రాణాన్ని తీసేంత తీవ్రంగా ఉండడానికి వీలులేదు. అదేవిధంగా సెక్షన్ 103 ప్రకారం బందిపోటు దొంగతనం, గృహదహనం మొదలైన నేరాల్ని నిరోధించడానికి కూడా ఎదురుదాడులు చేయవచ్చు. ఆ వాడి ప్రాణాంతకం కావచ్చు.

అంతకంటే చిన్న ఆస్తి సంబంధమైన నేరాలను నిరోధించే ఎదురుదాడి ప్రాణాంతకం కావడానికి వీలులేదు. పోలీసులు ఈమధ్యకాలంలో చేసిన కాల్పు లన్నింటిని ఈ చట్టాల కిందే సమర్థించుకుంటున్నారు. ఆస్తిరక్షణకు, ప్రాణరక్షణకు నియమాలేవీ ఉండజాలవన్న భరోసా దీనికి కారణం కావచ్చు.

అయితే ఇక్కడ రెండు విషయాలు గమనించాలి. ఈ సెక్షన్లు పౌరు లందరికీ వర్తిస్తాయి. పోలీసులకు ప్రత్యేక అధికారాలేవీ లేవు. ఆ విషయాన్ని భారత శిక్షాస్మృతి స్పష్టం చేస్తుంది. పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్ 886, 887 కూడా అదే విషయాన్ని నొక్కి చెబుతాయి.

మరి పౌరులెవరైనా ప్రాణరక్షణకోసమో, ఆస్తిరక్షణకోసమో ఎదురు దాడికి పాల్పడితే పోలీసు యంత్రాంగం ఏం చేస్తుంది? వాళ్ళను అరెస్టుచేసి దాడి చేసినందుకు కేసు పెడుతుంది. అది ఎదురుదాడేనని రుజువు చేసుకునే బాధ్యత ముద్దాయిమీదే ఉంటుంది. కోర్టును నమ్మించలేకపోతే శిక్ష పడుతుంది. ఈ విష యాన్ని భారత సాక్ష్యాల చట్టం స్పష్టం చేస్తుంది. ఎదురుదాడి ఏకపక్షంగా ప్రక టించుకునే హక్కు కాదు. అది ఒక మినహాయింపు మాత్రమే. మినహాయింపును కోరేవాళ్ళు దానికి కావాల్సిన పరిస్థితులు నిజంగా ఉండినాయని తామే రుజువు చేసుకోవాలి. అంటే ప్రాణరక్షణకోసమో, ఆస్తిరక్షణకోసమో కాల్పులు జరిపామని ప్రకటించే పోలీసులమీద హత్యకేసు పెట్టి జైలుకు పంపవలసి ఉంటుంది.

కాబట్టి సి.ఆర్.పి.సి. సెక్షన్ 129లో పోలీసులకు ఇచ్చిన అధికారాన్ని నిర్వర్తించే క్రమంలో స్టాండింగ్ ఆర్డర్ 885కు వ్యతిరేకంగా వ్యవహరించి నందుకైనా, ఆత్మరక్షణ ప్రాణరక్షణల కోసం కాల్పులు జరిపి ప్రాణాలు తీసినందు కైనా, ఈ కింది రిపోర్టులలో వివరించిన కాల్పులకు బాధ్యులైన పోలీసు అధికారు లను హత్యకేసులో అరెస్టుచేసి విచారించాలి. అది తప్ప వేరే చట్టసమ్మతమైన మార్గం లేదు.

ముగింపు :

మొదట్లో చెప్పినట్టుగా పెరిగిపోతున్న పోలీసు కాల్పులు తీవ్రమవుతున్న సామాజిక సంక్షోభంతో ముడిపడి ఉంది. కింది రిపోర్టులు పరిశీలిస్తే ఒక సంగతి స్పష్టమవుతుంది. ఆ కాల్పులకు దారితీసిన సంఘటనలేవీ కూడ సంఘవిద్రోహ చర్యలు కావు. అన్నీ కూడ సామాజిక కారణాల నుంచి పుట్టిన అలజడులే. ఇరు వర్గాల మధ్య సంఘర్షణ, న్యాయమైన కోర్కెలకోసం ఆందోళన, సౌకర్యాల లేమి వల్ల అసంతృప్తి మొదలైనవి ఈ అలజడులకు కారణాలుగా కనిపిస్తాయి. ప్రజలలో చైతన్యం ప్రభుత్వ నిర్లక్ష్యంపట్ల అసహనం పెరిగేకొద్దీ చిన్న చిన్న సామాజిక

సమస్యలు కూడ అలజడి రూపం తీసుకుంటున్నాయి. సామాజిక వ్యవస్థలో మొత్తంగా పతనమవుతున్న విలువలలో భాగంగా వివిధ వర్గాల పేద ప్రజానీకంలో కూడ సామరస్య ధోరణి నశించి ప్రతి చిన్న సమస్య ఘర్షణకు దారితీస్తోంది. ఈ ఘర్షణను వాడుకుని బాగుపడే పెత్తందార్లు, రాజకీయ నాయకులు కూడ తయారయ్యారు. ఈ నేపథ్యంలో బాధ్యతాయుతమైన ప్రభుత్వ యంత్రాంగం సమస్యలను పరిష్కరించడానికి, సామరస్యాన్ని నెలకొల్పడానికి ప్రయత్నం చేయాలి. అటువంటిదేమీ లేకుండా పోలీసులను దించడమే ఏకైక పరిష్కార మార్గంగా ప్రభుత్వాలు ఎంచుకుంటున్నాయి. సమస్యను పరిష్కరించవలసింది జిల్లా కలెక్టరైనా, పౌరసరఫరాల అధికారైనా, విద్యుత్ బోర్డు అధికారులైనా, రంగంలోకి దిగేది మాత్రం వాళ్ళెవరూ కాదు— పోలీసులే. పోలీసులకు చేతనైన పరిష్కారం కాల్పులే. పోలీసుల ప్రాముఖ్యం ఇంతగా పెరిగిపోయిన వ్యవస్థలో వాళ్ళను నియంత్రించడానికి, శిక్షించడానికి ఎన్ని చట్టాలుండి ఏం ప్రయోజనం?

# రాష్ట్రంలో పోలీసు కాల్పులు
# (1990 - ఏప్రిల్ 1991)

## పడ్కల్ (నిజామాబాద్ జిల్లా)

పడ్కల్ తండా జక్రాన్‌పల్లి మండలంలో ఏడో నెంబరు జాతీయ రహదారిపై వుంది. మార్చి 3న ఇక్కడ పోలీసులు కాల్పులు జరిపారు. శ్రీనివాస్ అనే పదవ తరగతి చదువుతున్న విద్యార్థి అక్కడికక్కడే చనిపోయాడు. కాశీరాం అనే 40 సంవత్సరాల రైతుకూలీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ చనిపోయాడు. వీళ్ళిద్దరూ పడ్కల్ గ్రామస్తులే. నారాయణపేట గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందాడు.

రోజుకు ఇరవై గంటలపాటు కరెంటు సరఫరా చేయాలని కోరుతూ మార్చి 3న పడ్కల్ తండావద్ద పడ్కల్, కొలిప్యాక్, మనోహరాబాద్, కలిగోట్, కొత్తపల్లి, చింతలూరు, కేశపల్లి, జక్రాన్‌పల్లి, నారాయణపేటకు చెందిన దాదాపు రెండువేలమంది రైతులు రాస్తారోకో ఆందోళనను చేపట్టారు. ఉదయం పదిగంటలనుంచీ వివిధ గ్రామాల రైతులు జట్లుజట్లుగా ఆందోళనలో పాల్గొనడానికి సైకిళ్ళమీదా, నడిచి పడ్కల్ తండాకు చేరుకోవడం మొదలెట్టారు. పడ్కల్ గ్రామంలో మార్చి 2న ఇంటికొకరు చొప్పున మర్నాడు జరిగే ఆందోళనలో పాల్గొనాల్సిందిగా మైకుద్వారా ప్రచారం చేశారు. డప్పు చాటింపు వేయించారు.

రైతులు రోడ్డుపై 11 గంటలకు బైఠాయింపు కార్యక్రమం మొదలెట్టారు. జాతీయ రహదారి కాబట్టి రెండువైపులనుంచీ వచ్చే మోటారు వాహనాలు ఆగిపోయాయి. దాదాపు ఫర్లాంగుదూరంపాటు రోడ్డంతా విస్తరించుకుని ఆందోళనకారులు రోడ్డుమీద కూర్చున్నారు. ఒక చెట్టును నరికి రోడ్డుకు అడ్డంగా పడవేశారు. కరెంటు సమస్యను తీర్చాలని నినాదాలిస్తూ రాస్తారోకో ఆందోళనలో చురుకుగా పాల్గొంటున్నారు. రోడ్డుమీద నిలిచిపోయిన లారీలనుగానీ, బస్సులనుగానీ, మరే ఇతర వాహనాలనుగానీ ఆందోళనకారులు ముట్టుకోలేదు. చక్రాలలో గాలి తీసివేయడంగానీ, అద్దాలను పగలగొట్టడంగానీ చేయలేదు. ఇతర వాహనాలకు ఎలాంటి

ఇతర నష్టమూ తలపెట్టలేదు. ప్రభుత్వానికి రైతులు ఎదుర్కొంటున్న కరెంటు కొరతను తెలియపర్చేందుకు తాము ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళన చేపట్టినట్లు ఆందోళనలో పాల్గొన్న రైతులు తెలిపారు.

దాదాపు మధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో నిజామాబాద్ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వరప్రసాదరావు ఆధ్వర్యంలో దాదాపు పది పన్నెండుమంది పోలీసులు పడకల్ తండావద్దకు చేరుకున్నారు. పోలీసులు ఆయుధాలు ధరించి వున్నారు. వరప్రసాదరావు రావడం రావడమే బూతుల పంచాగం విప్పాడు. బూతుమాటలు తిడుతూ ఆందోళనకారుల్ని చెదిరిపొమ్మని బెదిరించాడు. రావడం రావడం జనం మధ్యలోకి వచ్చాడు. డిచ్‌పల్లివైపునుంచి వచ్చాడు. వరప్రసాదరావుకూ అతని వెంటవున్న పోలీసులకూ చుట్టూ జనం నిలబడివున్నారు. చెదిరిపొమ్మని చెప్పిన దానికి బదులుగా తాము మధ్యాహ్నం రెండుగంటల వరకూ రాస్తారోకో చేస్తామనీ, ఆ తర్వాత ఇళ్ళకు వెళ్ళిపోతామనీ ఆందోళనకారులు ఇన్స్‌పెక్టర్‌కు చెప్పారు ఇదిలా నడుస్తుండగా నిజామాబాద్ అడిషనల్ ఎస్పీ లక్ష్మణ్ రాజ్ గారుకూడా అక్కడికి చేరుకుంది. ఆయన దూరంనుంచీ ఏం జరుగుతోందీ చూస్తున్నాడు. పోలీసులు తమతో పాటు ఏ మేజిస్ట్రేటునూ వెంట తెచ్చుకోలేదు.

చుట్టూ నిలబడ్డ జనాన్ని పక్కకు తప్పుకోమనీ, తాను వెళ్ళిపోతామనీ, వరప్రసాదరావు ఆందోళనకారుల్ని అడిగాడు. వరప్రసాదరావు వెళ్ళి మళ్ళీ అదనపు పోలీసు బలగంతో వచ్చి కాల్పులు జరుపుతాడేమోనని తాము భయపడ్డామనీ అందుకే రాస్తారోకో అయిపోయేంతవరకూ అంటే మధ్యాహ్నం రెండు గంటల వరకూ తమతోనే వుండాలనీ ఆందోళనకారులు వరప్రసాదరావును కోరినట్లుగా వాళ్ళు చెప్పారు. తాను వెళ్ళిపోతాననీ, పోలీసులు వెళ్ళడానికి వీలులేదనీ ఇలా మాట్లాడుతూ మాట్లాడుతూనే వరప్రసాదరావు దాదాపు వందగజాల దూరం డిచ్‌పల్లివైపుకు వెళ్ళాడు.

జనానికీ తనకీ కొద్దిగా దూరం వుండగానే అడిషనల్ ఎస్పీ ముందుగా రివాల్వర్ కాల్చాడు. వెంటనే వరప్రసాదరావు ఫైర్ అంటూ తనదగ్గర వున్న ఎస్.ఎల్.ఆర్. తుపాకితో కాల్పులు జరపడం ప్రారంభించాడు. పోలీసులూ కాల్పులు జరిపారు.

ఈ కాల్పుల్లో శ్రీనివాస్ అనే విద్యార్థి గుండెల్లోంచీ తూటా దూసుకుపోగా అక్కడికక్కడే చనిపోయాడు. కాశీరాంకు కడుపులోంచి పేగులు బయటకు వచ్చాయి. మరో వ్యక్తికి తూటా రాసుకుపోయింది. కాల్పులు జరపగానే పోలీసులు వేరే వాహనం ఎక్కి డిచ్‌పల్లివైపుకు వెళ్ళిపోయారు.

పోలీసులు వెళ్ళిపోయిన తర్వాత ఆందోళనకారులు పోలీసుల జీపునూ, కారునూ ధ్వంసం చేశారు. వాటికి నిప్పుపెట్టారు. రోడ్డుమీదవున్న మరే వాహనానికి ఎలాంటి నష్టమూ జరగకుండా జాగ్రత్తపడ్డారు.

కాశీరాంనూ, మరో వ్యక్తినీ ఆర్మూర్ ఆసుపత్రికి తీసుకుపోయారు. అక్కడ డాక్టర్లు చికిత్సకు తగిన సౌకర్యాలు లేవని చెప్పడంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. శ్రీనివాస్ శవాన్ని పడ్కల్ గ్రామంలో అతని ఇంటికి తీసుకెళ్ళారు. శ్రీనివాస్ తండ్రి దుబాయిలో పనిచేస్తాడు. ఆయనికి ఇంకా తన కొడుకు చనిపోయిన విషయం తెలీదు.

ఆ తర్వాత పోలీసులు చాలా పెద్దఎత్తున పడ్కల్ గ్రామంలోకి వెళ్లారు. ఎస్పీ రఘువీర్‌ప్రసాద్‌మీనా కూడా వెళ్ళాడు. రాడికల్స్ మాటలువింటే ఇదే గతి పడుతుందనీ, ఊరూరా అగ్గిపెట్టి నాశనం చేస్తామనీ గ్రామస్తుల్ని పోలీసులు బెదిరించారు. శ్రీనివాస్ శవపంచాయితీ జక్రాన్‌పల్లి మండల రెవిన్యూఅధికారి చేయాల్సి వుండగా డిచ్‌పల్లి మండల రెవెన్యూ అధికారితో చేయించారు.

ఆందోళనకారులు తమవద్ద వున్న తుపాకులను గుంజుకోవడానికి ప్రయత్నించారు కాబట్టే తాము కాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. జనంలోవున్న రాడికల్ కార్యకర్తలు పోలీసులపై బాంబులు వేయడానికి ప్రయత్నించారనీ, అయితే వాటిని విసిరితే జనం చస్తారనే వుద్దేశంతో వెయ్యలేదనీకూడా పోలీసులు ప్రకటించారు.

నిజనిర్ధారణకమిటీ అనేకమంది గ్రామస్తులతో ఈ విషయంపై వ్యాఖ్యానించమని కోరగా పోలీసుల ప్రకటన అంతా పచ్చి అబద్ధమనీ, ఒకవేళ అదే నిజమైతే వరప్రసాదరావు దిగీదిగడంతోనే తుపాకులు గుంజుకుని వుండేవాళ్ళు అనీ అసలు ఆందోళనకారులలో రహస్య కార్యకర్తలెవరూ లేరనీ, బాంబులువేసే సమస్యే లేదనీ, కరెంటు సమస్య తీవ్రతను ప్రభుత్వానికి తెలియచెప్పడానికి తాము ఆందోళన చేస్తున్నాము తప్ప తమకు మరో ఉద్దేశం లేదని రైతులు కమిటీముందు నిర్ద్వంద్వంగా చెప్పారు. అయితే ఎవరో ఆకతాయి పోలీసులపై ఒక రాయి విసిరిన మాట నిజమేనని చెప్పారు. అసలు పోలీసులు తమ గ్రామానికి రావాల్సిన అవసరమే లేదని, వాళ్ళు రావడం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత గానే

ఆందోళనను విరమించి వుండేవాళ్ళమనీ రైతు నాయకులు తెనుగు భూషన్న, కట్కూరం నారాయణలు తెలిపారు. పోలీసులు దాదాపు 60 సైకిళ్ళను లారీమీద వేసు కొచ్చారు.

## నగరి (చిత్తూరుజిల్లా)

తిరుపతికి 45 కిలోమీటర్ల దూరంలోని నగరిలో మార్చి 15వ తేదీ ఉదయం ఎనిమిదిన్నర, తొమ్మిది గంటల ప్రాంతంలో పోలీసులు ముగ్గురు హరిజనులను తుపాకులతో కాల్చి చంపారు. తాము చెప్పినవారిని కాల్చడంలేదని కోపించి "సుల్తాన్‌భాయ్" వర్గానికి చెందిన ఒక గూండా, కృష్ణయ్య అనే హెడ్‌కానిస్టేబుల్ దగ్గరనుండి రైఫిల్ లాక్కుని హరిజనులపైకి కాల్చాడు. కాల్పులు జరిపిన వారిలో ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్‌కూడా వున్నాడు. ఇన్‌చార్జి ఎస్.ఐ. గోపాల్, ఇన్‌ఛార్జి సి.ఐ. మొగిలప్పల ఆధ్వర్యంలో కాల్పులు జరిగాయి.

నగరి హరిజనవాడలో కాపురముంటున్న నాగమ్మ, శకుంతల, నటరాజు ఈ కాల్పుల్లో మృతిచెందారు. బులెట్ నాగమ్మ తలలోనుండి దూసుకుపోయింది. ఇదే హరిజనవాడలో వుంటున్న వేలాయుధం, మాణిక్యం, యేలుమలై, జాన్‌రాజు, ఏసు, శ్రీరాములు, మణి, దండయ్యలకు బులెట్‌లు తగిలాయి, తర్వాత ఆస్పత్రిలో కోలుకొన్నారు.

ఏప్రిల్ 27వ తేదీవరకు కూడా ఈ హత్యాకాండ గురించి ప్రభుత్వం ఏమీ పట్టించుకోలేదు. ఎవరిమీదా కేసుపెట్టలేదు. ఎవరినీ అరెస్టు చేయలేదు. చిత్తూరు ఆర్.డి.ఓ. ఆధ్వర్యంలో మెజిస్టీరియల్ విచారణమాత్రం 22-4-1990 తేదీన పూర్తయింది. విచారణను తొలుత హరిజనులు బహిష్కరించారు. కానీ విచారణకు "సహకరించ"వలసిందిగా 'సుల్తాన్‌భాయి' యిచ్చిన పత్రికా ప్రకటనను చూచి భయపడిన హరిజనులు 'సహకరించారు.'

1. రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి సొంత నియోజకవర్గం నగరి.

2. రెడ్డివారి చెంగారెడ్డి ఎన్నికలలో గెలవడానికి ముఖ్య కారకుడు, సారాకాంట్రాక్టరు, అన్నా డి.యం.కె. చిత్తూరుజిల్లా కార్యదర్శి సుల్తాన్‌భాయి.

3. చెంగారెడ్డి, సుల్తాన్‌భాయి, నగరి పోలీసుస్టేషనూ ఒకే తానులోని ముక్కలు. వీరికి రాజకీయంకంటే రాబడి ముఖ్యం.

4. తరతరాలుగా కాంగ్రెస్‌పార్టీనే నమ్ముకొన్నవాళ్లు, సుల్తాన్‌భాయి పనుల్లో పనిముట్లు, చెంగారెడ్డి ఎన్నికల ప్రచారంలో రెక్కలు ముక్కలు చేసుకున్న వాళ్ళు నగరి హరిజనవాడవాసులు (దాదాపు వంద ఇళ్ళు వుంటాయి).

5. చిన్న చిన్న కారణాలు ఎన్నివున్నా, సుల్తాన్‌భాయి అడుగులకు మడుగులొత్తడానికి ఇష్టపడని ఒక కొత్తతరం యువకులు హరిజనవాడలో తయారు కావడం గమనంలోకి తీసుకోవలసిన విషయం.

6. ఈ కొత్తతరం వారికి 'సుల్తాన్‌భాయి' అంటే ఏమిటో చూపించి దారిలోకి తీసుకురావడం సుల్తాన్‌భాయి ప్రస్తుత కార్యక్రమం. హరిజనులలో రిక్షాలు తొక్కి, మాంసం అమ్మి, కూలికి వెళ్ళి, ఫ్యాక్టరీకి వెళ్ళి పనులు చేసేవారున్నారు. అచ్చంగా సుల్తాన్‌భాయి పనులలోనే (స్మగ్లింగూ, స్త్రీలను తార్చడమూ కూడా అని పుకార్లున్నాయి) వుండేవారూ వున్నారు. సుల్తాన్‌భాయి వర్గం వారికి బిరియానీ హోటళ్ళు కూడా వున్నాయి. సినిమా థియేటరూ వుంది.

ఒక్కోసారి సారాయి దగ్గర, మాంసం దగ్గర, రిక్షాస్టాండు దగ్గర గొడవలైతే సుల్తాన్‌భాయి 'మాట' మీద సద్దుమణిగేవి. కానీ కొత్తతరం దెబ్బలకు కూడా జడవక ఎదురు తిరగడం నేర్చింది. ట్రేడ్‌యూనియన్‌లలో కూడా చాలా మంది చేరారు. అంబేద్కర్ యువజన సంఘం అని కూడా ఏర్పాటు చేశారు. ఇదంతా నేపథ్యం. ఇక అసలు సంఘటనకు వద్దాం.

వేరేవాళ్ళ హోటళ్ళ కెందుకు మాంసం సరఫరాచేస్తావు ? అని పాసీఫా హోటల్ యజమాని హరిజన బసవయ్యను మార్చి 13వ తేదీ గద్దించాడు. అందుకు వినయంగా సమాధానం చెప్పకపోవడంతో బసవయ్య దెబ్బలు తిన్నాడు. దీనితో భయపడి మరో యిద్దరిని వెంట తీసుకుని పోలీసులకు ఫిర్యాదుచేయబోయాడు. కానీ పోలీసులు బసవయ్యనే తిట్టి ఫిర్యాదు తీసుకోడానికి నిరాకరించారు. తర్వాత బసవయ్య హరిజనవాడకు వెళ్ళి జనాన్ని వెంటబెట్టుకుని వచ్చాడు. సుల్తాన్‌భాయి వర్గీయులతో హరిజన యువకులు తలపడ్డారు. సోడాబుడ్లు పగిలి, ఇటుకరాళ్ళు తగిలి సుల్తాన్ వర్గీయులు నలుగురు గాయపడ్డారు. సుల్తాన్ వర్గీయులు గాయపడిన విషయం తెలిసిన వెంటనే వేలు, ఏళుమలై, బసవయ్యలను అరెస్టు చేయడానికి పోలీసులు హరిజనవాడ వెళ్ళారు. కానీ వారు దొరకలేదు. ఆ ముగ్గురి ఆచూకీ చెప్పకపోతే హరిజనవాడే వుండదని హరిజనులను బెదిరించి పోలీసులు వెళ్ళిపోయారు ఈ ఘర్షణలో పాల్గొనని మిగిలిన హరిజనులు మార్చి 14 వ తేదీ ఉదయం రిక్షాలను తీసుకుని టౌన్‌లోకివచ్చి ప్రకాశంరోడ్డు స్టాండులో పెట్టబోయారు. అయితే ఆశ్చర్యకరంగా రిక్షాస్టాండు ప్రాంతంలో సుల్తాన్‌భాయి వర్గీ

యుల పండ్లు, పూల బండ్లు వెలిశాయి. ఇదేమిటీ అని అన్నారో లేదో హరిజను లకు చెందిన ఒక రిక్షా ధ్వంసం అయిపోయింది. రిక్షాలు తెచ్చిన హరిజనులను సుల్తాన్ వర్గీయులు తరిమి కొట్టారు.

ఆ రోజు సాయంత్రం హరిజనవాడలో అంతా సమావేశమై యేదో మాట్లాడుకొంటున్నట్టు ప్రచారమయింది. అదే రాత్రి 12 గంటల ప్రాంతంలో ఇన్‌ఛార్జి ఎస్.ఐ. గోపాల్ మరో కానిస్టేబుల్ కలిసి నగరి హరిజనవాడకు వెళ్ళారు. నిద్రలో వున్న హరిజనులను లేపి 'మీకు ఎలాంటి అన్యాయం జరగకుండా క్షేమ రక్షణ కల్పిస్తాం' అని హామీ యిచ్చారు. 15వ తేదీ ఉదయం ధైర్యంగా రిక్షాలను స్టాండులో పెట్టుకోవచ్చునని అన్నారు.

పోలీసుల మాటలు నమ్మి 15వ తేదీ ఉదయం 7-30 గంటలకు హరిజనులు మూడు రిక్షాలను స్టాండులోకి తెచ్చారు. తెచ్చిన వెంటనే అక్కడ వేచివున్న సుల్తాన్ వర్గీయులు వారిని కొట్టి మూడు రిక్షాలను ధ్వంసం చేశారు. పోలీస్‌స్టేషన్‌కు ఈ రిక్షాస్టాండు అతి సమీపంలోనే వుంది. కానీ పోలీసులు చూసి చూడనట్టు వుండిపోయారు. దెబ్బలుతిన్న హరిజనులు వాడకువెళ్ళి విషయం చెప్పారు. వందమందికిపైగా సుల్తాన్ గూండాలు వున్నట్టుకూడా చెప్పారు. దాంతో ఒక యాభై అరవై మంది హరిజనులు రిక్షా స్టాండు దగ్గరకు బయలుదేరారు.

కానీ రిక్షాస్టాండు దగ్గర పరిస్థితి వేరుగావుంది. పోలీసులు నిలబడి వున్నారు తుపాకులతో, వారి వెనక సుల్తాన్ వర్గీయులున్నారు. ఆ ప్రాంతానికి హరిజనులు చేరుకోగానే సుల్తాన్ వర్గీయులు సోడాబుడ్లు విసిరారు. పోలీసులు కాల్పులు జరిపారు. హరిజనులు చెల్లాచెదరై ఈ హఠాత్తు పరిణామానికి దిగ్భ్రాంతులై పరిగెత్తారు. "వాడే వాడే వాడికి తగల్లేదు" అని చెప్పి ఒక హెడ్‌కానిస్టేబుల్ దగ్గరనుంచి ఒక గూండా రైఫిల్ లాక్కుని హరిజనులపైకి కాల్చాడు. చిత్తంవచ్చినట్టుజరిపిన ఈ కాల్పులలో కూలిపనికి వెళుతున్న నాగమ్మ, శకుంతలతోబాటు రిక్షా కార్మికుడు నటరాజు ప్రాణాలు కోల్పోయాడు. సారాకాంట్రాక్టరు సుల్తాన్‌బాయికి ఎక్సయిజు డిపార్టుమెంటుతో వున్న లావాదేవీలమూలంగా ఒక ఎక్సయిజు పోలీసు కూడా తుపాకీతో వచ్చి కాల్చాడు.

లాఠీచార్జిలేదు. టియర్‌గ్యాస్‌లేదు. గాలిలో కాల్పులులేవు. సుల్తాన్‌బాయీ, పోలీసులూ కలిసి ఆలోచించుకున్న ప్రకారం జరిగినట్టుగా వుంది ఈ సంఘటన.

16వ తేదీ మంత్రి చెంగారెడ్డి హరిజనవాడకు వచ్చాడు. రక్షణగా వచ్చిన పోలీసులు పూరిబయటే వుండిపోయారు. సుల్తాన్‌బాయి గూండాలు తుపాకు

లాక్కొని కాల్చారని ఏడుస్తూ వెక్కి వెక్కి చెప్పారు హరిజనులు. కొంత పరిహారం ప్రకటించి ఆ తర్వాత మంత్రి నగరి పోలీసుస్టేషన్‌కి వచ్చాడు. విలేకరులను మాత్రమే వుండమని మిగతావారు దూరంగా వుండాలని పోలీసులు ఆదేశించారు. ఇంతలో పోలీసుస్టేషన్ దగ్గరి జనసమూహమంతా రెండుగా చీలింది. సుల్తాన్‌భాయి నడుచుకుంటూ వచ్చాడు. డార్క్‌గ్రీన్ చలవకళ్ళద్దాలతో వచ్చి కలెక్టర్‌పక్కన, మంత్రి చెంగారెడ్డి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. చెంగారెడ్డికి థమ్స్‌అప్, జిల్లాకలెక్టరు నాగార్జునకి, సుల్తాన్‌భాయికీ లిమ్కాలువచ్చాయి. ఎ.ఎస్.పి. సత్యనారాయణ, డి.ఎస్.పి పరమహంసా అటూ ఇటూ నిలబడ్డారు. చెంగారెడ్డీ, సుల్తాన్‌భాయీ నిజంగా నవ్వుతున్నారు. 'పోలీసుల నుంచి రైఫిల్స్ తీసుకుని కాల్చినారంటగదా హరిజనులు చెబుతున్నారు' అనిఅడిగాడు మంత్రి. లిమ్కా సిప్‌చేసి ఏమో తెలియదన్నట్టుగా కుడిచేయి పైకెత్తి తిప్పాడు సుల్తాన్‌భాయి.

సుల్తాన్‌భాయి కోరికమేరకు (బహుశా) పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సొంత నియోజకవర్గమైన నగరి పోలీసుస్టేషన్‌కి మూడు నెలలుగా ఎస్.ఐ. లేడు. వెదురుకుప్పం, వడమాలపేట ఎస్.ఐ. నగరికి కూడా బాధ్యులుగా వ్యవహరిస్తున్నారు. ఇంత జరిగినా పోలీసుల నుంచి సుల్తాన్‌భాయి గూండాలు తుపాకులు లాక్కుని కాల్చిన సంగతిని ఒక్క విలేకరి కూడా రిపోర్టుచేయలేదు. ఇదీ సుల్తాన్ మహత్యమా !?

## బాన్సువాడ (నిజామాబాద్ జిల్లా)

తొమ్మిది సంవత్సరాల క్రితం ఇంద్రవెల్లిలో గిరిజనులమీద కాల్పులు జరిగిన దినాన అంటే ఏప్రిల్ 20వ తేదీన ఈ సంవత్సరం నిజామాబాద్‌జిల్లా మండల కేంద్రమయిన బాన్సువాడలో ఖేతాళస్వామి జాతర బందోబస్తు డ్యూటీ మీదవున్న పోలీసులు కుస్తీ పోటీలు దగ్గర జరిగిన చిన్న అల్లరిని అణచివేసే ప్రయత్నంలో ప్రజల కోపానికి గురయి ఆ ప్రజలమీదనే కాల్పులుజరిపి ఆరుగురిని పొట్టన పెట్టుకున్నారు. జాతరలోవున్న 'రాడికల్స్' పోలీసులమీద దాడిచేసి పోలీసు స్టేషన్‌ను ధ్వంసం చేశారనీ, తుపాకులు లాక్కొనే ప్రయత్నం చేశారనీ, 'ఆత్మరక్షణ' కోసం పోలీసులు కాల్పులు జరపవలసి వచ్చిందని జిల్లా సూపరింటెండెంట్ రఘువీర్ ప్రసాద్ మీనా వెంటనే ఒక ప్రకటన చేశారు. డి.ఐ.జి. రామయ్యగారు మట్టుకు రాడికల్స్ ప్రస్తావన లేకుండా ఎవరో 'దుష్ట శక్తులు' పోలీసులమీద దాడి చేశారని అన్నారు. నిజానికి అక్కడ రాడికల్స్ లేరు, పోలీస్ స్టేషన్‌మీద దాడి

జరగలేదు. పూర్తిగా నిష్కారణంగానూ అమానుషంగానూ కాల్పులు జరిపి ఆరు ప్రాణాలను పోలీసులు పొట్టన బెట్టుకున్నారు.

కుస్తీపోటీలవద్ద వివాదం :

ఏప్రిల్ 20 వ తేదీన జాన్సువాడలో భేతాళస్వామి జాతర ఎప్పటివలె జరిగింది. కుస్తీపోటీలు జాతరలో ముఖ్యమైన ఆకర్షణ. ఈ సంవత్సరం కుస్తీ పోటీలు జూనియర్ కాలేజీ ఆవరణలో జరిగాయి. పోటీల నిర్వహణకు గ్రామ సర్పంచ్, మాజీ పోలీసు పటేళ్ళతో, కూడిన ఒక కమిటీ ఏర్పాటయింది. మాజీ పోలీస్ పటేల్ శ్రీ గంగారాం 20 వ తేదీ సాయంత్రం గ్రామంలో లేరు. సర్పంచ్ శ్రీ మాసాని శ్రీనివాసులురెడ్డి మట్టుకు ఆ రోజంతా గ్రామంలోనే వుండి కుస్తీ పోటీల నిర్వహణను స్వయంగా చూసుకున్నాడు. సాయంత్రం 4-30 సమయంలో పోచయ్య (తల్లి గూండ్ల మైసమ్మ) తానుకూడా పోటీలో పాల్గొంటానని పట్టు బట్టాడు. సర్పంచ్ కొన్ని సాంకేతిక కారణాలవల్ల అనుమతి నిరాకరించాడు. అతను మొండిగా పాల్గొంటానని పట్టుబట్టేసరికి, జాతరకు బందోబస్తు చేస్తున్న పోలీసులు రంగంలోకి దిగారు. సివిల్ పోలీసులు, హోంగార్డులు కలిసి 7 లేక 8 మంది దాకా వున్నారు. వీళ్ళకు నాయకత్వం వహించిన హెడ్‌కానిస్టేబుల్ సాయన్న. మొండిగా సర్పంచ్‌తో వాదిస్తూవున్న పోచయ్యకు నచ్చచెప్పే ప్రయత్నమేమీ చేయకుండా పోలీసులు అతనిని కొట్టటం మొదలుపెట్టారు. అతనిని చాలా తీవ్రంగా కొట్టారని తలచిట్లి రక్తం కారడం మొదలు పెట్టిందనీ సర్పంచ్‌తోసహా సాక్షు లందరూ అంటున్నారు. సర్పంచ్ అడ్డంపోగా పోలీసులు ఆయననుకూడా కొట్టారు. ఈ ప్రవర్తనకు ప్రజలు ఆగ్రహించి పోలీసుల మీదికి తిరగబడ్డారు. సర్పంచ్ పోలీసులకు నచ్చచెప్పి వెళ్ళిపొమ్మన్నారు. పోలీసుల దగ్గర తుపాకులుంటే అప్పుడే కాల్పులు జరిపేవారేమోగానీ తుపాకులు లేవు కాబట్టి వెనక్కి తిరిగి కాలికి బుద్ధి చెప్పారు. అయితే జనం అక్కడితో ఆగకుండా వాళ్ళను పోలీస్ స్టేషన్ దాకా వెంబడించారు.

సర్పంచ్‌తో సహా గ్రామస్తులందరూ ఇదే కథ చెపుతూండగా ఎ.ఎస్.పి. సత్యనారాయణగారు మట్టుకు, తమ పోలీసులు సమస్యను చాలా సామరస్యంగా పరిష్కరించే ప్రయత్నం చేస్తూండగా జనమే పోలీసుల జోక్యాన్ని సహించలేక పోలీసుల మీద దాడిచేశారని అంటున్నారు. జనానికి పోలీసుల మీద అంతకోపం ఉండవలసిన అవసరం ఏమిటంటే మట్టుకు ఆయన దగ్గర సమాధానం లేదు. నిజానికి సాయన్న (హెడ్‌కానిస్టేబుల్) దుందుడుకు ప్రవర్తనే మొత్తం సమస్యకు కారణం అని సర్పంచ్‌తో సహా అందరూ ఒప్పుకుంటున్నారు. అతను ప్రజలతో

ఎప్పుడూ దురుసుగానే ప్రవర్తిస్తాడని గ్రామస్తులందరూ అంటున్నారు. ఎ.ఎస్.పి. గారు ఆ వాస్తవాన్ని కప్పిపెట్టడానికి ప్రయత్నించడం శోచనీయం.

## పోలీస్‌స్టేషన్ మీద దాడి :

దాదాపు 1500 సంఖ్యలో ప్రజలు పోలీసులను కుస్తీపోటీల స్థలంనుండి తరుముకుంటూ వచ్చి పోలీస్‌స్టేషన్‌లోనికి వాళ్ళు ప్రవేశించగానే స్టేషన్‌మీద దాడి చేసారనీ, ఒక తుపాకీ లాక్కునే ప్రయత్నం చేసారనీ, స్టేషన్‌లో ట్యూబ్ లైట్లు, కుర్చీలు ధ్వంసం చేశారనీ పోలీసులు ఇప్పుడు అంటున్నారు. ఇది వట్టి కట్టుకథ. హెడ్‌కానిస్టేబుల్ సాయన్న ఆధ్వర్యంలో పోచయ్య మీద జరిగిన దాడికి ప్రజలు స్పందించి నిరసన తెలపటం పోలీసులకు ఆగ్రహం కలిగించింది. అయితే వాళ్ళ దగ్గర లాఠీలు తప్ప వేరే ఆయుధాలు లేవు. కాబట్టి వెనక్కి తిరిగారు. పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగానే అక్కడున్న ఎ.పి.ఎస్.పి. కానిస్టేబుళ్ళ తుపాకుల అండతో జనం మీదికి హెడ్‌కానిస్టేబుల్ సాయన్న కాల్పులు జరిపించాడు. కాల్పులు ప్రారంభం కాగానే అక్కడికి చేరుకున్న ఎస్. ఐ. కాల్పులను కొనసాగించాడు. జనం పోలీసుల మీద దాడిచేయలేదు సరికదా, అసలు పోలీస్‌స్టేషన్ ఆవరణలోకి సహితం ప్రవేశించలేదు. పోలీస్‌స్టేషన్ లోపల బీభత్సం చేస్తూండగా కాల్పులు జరిపి ఉంటే కనీసం ఒక్క శవమయినా స్టేషను ఆవరణలో దొరికి ఉండాలి. లేదా కనీసం స్టేషన్ ఆవరణలో రక్తం మరకలయినా వుండి వుండాలి అటువంటిదేమీ లేదని పోలీసులే ఒప్పుకుంటున్నారు. చనిపోయిన అయిదుగురి శవాలూ పోలీస్‌స్టేషన్ వెలుపల సందులలోనూ జూనియర్ కాలేజీ ఆవరణలోనూ దొరికాయి. గాయపడిన వారంతా స్టేషన్ బయటే గాయపడ్డారు. గాయపడినవారిలో ఒక వ్యక్తి అనంతరం ఆస్పత్రిలో మరణించాడు.

పోలీస్ స్టేషన్ మీద దాడి 20వ తేదీ రాత్రి అంతా సద్దుమణిగిన తరువాత పోలీసులే చేసుకున్నారు. తామే రెండు మూడు ట్యూబ్‌లైట్లు పగలగొట్టుకొని కుర్చీలను ధ్వంసం చేసుకొని రాళ్ళు, కర్రలు స్టేషన్ మీద రువ్వుకొని ఒక బీభత్స దృశ్యాన్ని సృష్టించుకొన్నారు. ఇది ఎస్.ఐ., హెడ్‌కానిస్టేబుళ్ళు చేసిన పనికాదు. మొత్తం జిల్లా పోలీస్ యంత్రాంగం అనుమతితో జరిగిన పని.

## కాల్పులు జరిపిన వైనం :

కాల్పులు కేవలం తమ దుష్ప్రవర్తనకు జనం ఎదురుతిరిగారన్న కసితో చేసారు తప్ప వేరే ఏ కారణం లేదు. జనం పోలీసులను వెంబడించి పోలీసుస్టేషన్

దాకా పోకపోతే హెడ్‌కానిస్టేబుల్ సాయన్న ఎ.పి.యస్.పి. జవాన్లనూ వాళ్ళ తుపాకులనూ వెంటబెట్టుకొచ్చి కాలేజీ ఆవరణలోనే కాల్పులు జరిపి ఉండేవాడు.

మొదట పోలీసులు పోలీస్‌స్టేషన్ గోడదగ్గరికి వచ్చి గోడ మీద నుండి రోడ్డుపైనున్న జనంలోకి కాల్పులు జరిపారు. తెనుగు బాలరాజు ఈ కాల్పులలో చనిపోయాడు. మిగిలిన జనం పారిపోయారు. జనాన్ని చెదరగొట్టడమే పోలీసుల ఉద్దేశ్యమయితే అక్కడితో కాల్పులు ఆపి ఉండేవారు. అయితే పోలీసులు స్టేషన్ ఆవరణ నుండి బయిటికి వచ్చి పారిపోతున్న జనం మీద కాల్పులు జరుపుకుంటూ తరిమారు. మరొక ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు (ఎర్రపోచయ్య, మారుతి, పరశురాం). బండారి సాయిలు ఆ రాత్రి ఆస్పత్రిలో చనిపోయాడు. మరొక17మంది గాయపడ్డారు. చాలాకాలం బాన్సువాడ ఆస్పత్రిలో ఇద్దరు, నిజామాబాద్ ఆస్పత్రిలో ఐదుగురు, హైద్రాబాద్‌లో ఒకరు ఉన్నారు. హైద్రాబాద్‌కు తరలించబడిన మోనయ్యకు తలలో బుల్లెట్ గాయమయ్యింది. తరువాత అతనూ చనిపోయాడు. కొన్ని రోజుల తర్వాత మరొక వ్యక్తి కూడా మరణించాడు.

కాల్పులు చాలా విచ్చలవిడిగా, ప్రతీకారం తీర్చుకునే పద్ధతిలో జరిగాయి. సయ్యద్ బాబుమియా పోలీస్ స్టేషన్ ఎదురుగా సైకిల్‌షాపులో పనిచేసుకుంటున్నాడు. అతను బయటికి రాలేదు. దుకాణం తలుపులు తీయలేదు. ఒక బుల్లెట్ దుకాణం గోడల నుండి దూసుకుపోయి అతనికి చెవిపక్కన తాకింది. సయ్యదు నబీ రిక్షా తొక్కుకుంటూ తన మానాన తాను పోతుండగా వెనుక నుండి బుల్లెట్లు వచ్చి ఒకటి వీపుకు, ఒకటి కాలికి తగిలాయి. 7వ తరగతి విద్యార్థి అయిన పోల శివరాజు ఈ గొడవకు భయపడి జూనియర్ కాలేజీ ఆవరణలోకి పారిపోతూ వుండగా వెనుకనుండి వచ్చిన బుల్లెట్లు నుదుటి పక్కన, చేతిమీద గాయాలు చేశాయి. జూనియర్ కాలేజీ పక్క సందులో దాక్కున్న నారాయణరెడ్డి అనే ముసలి అతని చేతిగుండా ఒక బుల్లెట్ పోయింది. గాయపడినవారిలో అత్యధికులు జూనియర్ కాలేజీ ఆవరణలో గాయపడ్డారు. జూనియర్ కాలేజీ క్లాస్‌రూం గోడమీద ఒక బుల్లెట్ తాకిన స్పష్టమైన గుర్తు కూడ వుంది. అంటే పోలీసులు పూర్తిగా నిష్కారణంగా జనాన్ని తరిమి తరిమి కాల్పులు జరిపారని అర్థం అవుతుంది.

## కాల్పులు జరిపే అధికారం :

దొమ్మీని నిరోధించడం కోసం సాధారణ బలప్రయోగం సరిపోకపోతే కాల్పులు జరిపే అధికారం చట్టరీత్యా పోలీసులకు ఉంది. అయితే, ఇది గత్యంతరం లేని పరిస్థితులలో మట్టుకే జరగాలి. అందుకోసం చట్టం చాలా నియమాలను నిర్దేశిస్తుంది.

కానీ వాస్తవానికి ఎక్కువగా కాల్పుల సంఘటనలు జరుగుతున్నది దొమ్మీలను నిరోధించడానికికాదు. పోలీసుల దుష్ప్రవర్తనను జనం ప్రశ్నించినా వ్యతిరేకించినా కాల్పులుజరపడం చాలా తరచుగా జరుగుతూవుంది. ఇవి ప్రతీకారం కోసం జరిగే కాల్పులు. ఈ కాల్పులు జరిపేటప్పుడు పోలీసులు ఎటువంటి నియమాలను పాటించడం లేదు. విచ్చలవిడిగా జరుపుతున్నారు. హెచ్చరికలు చేయడం, బాష్పవాయువు ఉపయోగించడం మొదలయిన చర్యలేవీ చేపట్టకుండా నేరుగా కాల్పులు జరుపుతున్నారు. దీనిని సమర్థించుకోవడం కోసం పోలీస్ స్టేషన్ మీద జనం దాడి చేశారనీ ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపవలసి వచ్చిందనీ కట్టు కథలు అల్లుతున్నారు. తమ పోలీస్‌స్టేషన్‌ను తామే ధ్వంసం చేసుకొని 'సాక్ష్యాలను' సృష్టిస్తున్నారు. ఇది చట్టం చాలా ప్రత్యేకమయిన అవసరాలను దృష్టిలో ఉంచుకొని పోలీసులకు ఇచ్చిన తుపాకులను దుర్వినియోగ పర్చడం తప్ప వేరే ఏమీకాదు.

పోలీసులు చెపుతున్న కథలు పరస్పర విరుద్ధంగా వున్నాయి. ఇటువంటివి మామూలుగా జాతరలలో జరిగే గొడవలేనని డి ఐ.జి. అంటూండగా, జాతరలో తీవ్రవాదులు ఉన్నారనీ వాళ్ళు పోలీసుల మీద దాడిచేసి తుపాకులు లాక్కోవాలని ప్రయత్నించారనీ ఎస్.పి.గారు అంటున్నారు. గ్రామస్థులను ఈ విషయమై ప్రశ్నించగా సర్పంచ్‌తో సహా అందరూ కూడ అసలు తీవ్రవాదుల ప్రమేయమేమీ లేదనీ ఎవ్వరూ తుపాకులు లాక్కొనే ప్రయత్నం చేయలేదనీ అంటున్నారు. ఎస్. పి. తన సిబ్బంది చేసిన ఘోరాన్ని కప్పిపెట్టటం కోసం 'తీవ్రవాదులు' అనే బూచిని వాడుకుంటున్నారని స్పష్టం అవుతుంది.

## ఇడిమేపల్లి (నెల్లూరు జిల్లా)

మే 6వ తేదీ తెల్లవారుజామున నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని ఇడిమేపల్లి గ్రామం బయట పొలాలలో పోలీసు కాల్పులు జరిగి చల్లా రాజయ్య, చల్లా చెంచయ్య, చల్లా దయాకర్ అనే ముగ్గురు వడ్డె కులానికి చెందిన రైతులు మరణించారు.

ఇడిమేపల్లి గ్రామంలోని వడ్డెపల్లిలో రెండు వర్గాలున్నాయి. ఒకటి గ్రామ ప్రెసిడెంట్ ఉప్పు చిన అంకులయ్య వర్గం కాగా, రెండవది ఆయన ప్రత్యర్థి వర్గం. మొదటిది కాంగ్రెస్ పార్టీకి, రెండవది తెలుగుదేశం పార్టీకి చెందిన వర్గాలు. ఈ రెండు వర్గాల మధ్య తీవ్రమైన ఘర్షణ ఉందనీ అదే కాల్పులకు దారితీసిందనీ పోలీసులు అంటున్నారు. అయితే ఈ రెండు వర్గాల మధ్య ఘర్షణ ఉన్నమాట వాస్తవమే అయినప్పటికీ అది ప్రమాదకరమైన స్థాయిలో ఎన్నడూ లేదు. అప్పుడప్పుడు పరస్పరం కొట్టుకోవడం, తన్నుకోవడం కేసులు పెట్టుకోవడం

జరుగుతూవున్నా మారణాయుధాల ప్రయోగంగానీ, బాంబుదాడులుగానీ ఎన్నడూ జరగలేదు. 1988 గ్రామపంచాయితీ ఎన్నికలలో ఉప్పు చిన అంకులయ్య గ్రామ సర్పంచ్‌గా గెలిచినప్పటినుండి చిన్నచిన్న ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. చిన అంకులయ్య వడ్ల వ్యాపారం చేసేటప్పుడు తన ప్రత్యర్థుల వడ్లకు తప్పుడు కొలతలు ఉపయోగిస్తాడని అతనిమీద ఒక ఆరోపణ. రోజ్‌గార్ నిధులు సక్రమంగా ఖర్చుచేయకుండటం ఇంకొక ఆరోపణ. చేపలచెరువు వేలంపాట మీద వచ్చిన మొత్తాన్ని గ్రామ ఉమ్మడి అవసరాలకు ఖర్చు చేయడం లేదని మరొక ఆరోపణ.

ఈ ఘర్షణలలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి వుంటే పరిస్థితి చేయిదాటిపోయి ఉండేదికాదు. అయితే పోలీసులు గ్రామ సర్పంచ్‌వట్ల పక్షపాతంతో వ్యవహరిస్తూ వచ్చారు. అతని ప్రత్యర్థులమీద కేసులు పెట్టడంలో చూపిన ఆసక్తి అతని వర్గంమీద కేసులు పెట్టడంలో చూపలేదు.

గ్రామ సర్పంచ్ ప్రత్యర్థివర్గం చాలా దౌర్జన్యకారులనీ పోలీసులమీద చాలాసార్లు దాడులు చేశారనీ ఇంకొక ఆరోపణ. దీనిని సమర్థించడానికి ఎటువంటి ఆధారాలూ లేవు. వెంకటాచలం ఎస్.ఐ. దేవిడ్‌నూ అంతకుముందున్న ఎస్.ఐ.నీ వాళ్ళు చాలాసార్లు కొట్టారనీ, బూతులు తిట్టారనీ పోలీసులు అంటున్నారుగానీ విచిత్రమైన విషయం ఏమిటంటే ఏ ఒక్క సంఘటనమీదా పోలీసులు కేసు పెట్టలేదు. కేసు ఎందుకు పెట్టలేదని అడిగితే 'మాకే పరువు పోతుందని పెట్టలేదు' అంటున్నారు. కానీ పోలీసులమీద ఎవరైనా తెలిసో తెలియకో చేయి చేసుకుంటే పోలీసులు అంత సులభంగా తామే సిగ్గుపడి వదిలిపెట్టడం అనేది ఎక్కడా జరగదు. వాళ్ళమీద పెద్ద ఎత్తున ప్రతీకారం తీర్చుకోకుండా ఉండరు. కాల్పులు జరిపి ముగ్గురు నిరాయుధులయిన రైతులను చంపడాన్ని సమర్థించుకోవడంకోసం వాళ్ళను చాలా ప్రమాదకరమైన వ్యక్తులుగా చిత్రించే ప్రయత్నమే తప్ప పై ఆరోపణలలో వాస్తవం లేదు.

రెండువర్గాల మధ్య సాగుతున్న ఘర్షణల ఫలితంగా ఇడిమేపల్లిలో ఏప్రిల్ నెలలో పోలీసు క్యాంపు వెలిసింది. సర్పంచ్‌కు వ్యతిరేకులయినవారిని అరెస్టు చేయడంకోసం పోలీసులు ప్రయత్నించసాగారు. వాళ్ళు రాత్రిళ్ళు దూరాన పండుకుంటూ పగలు పనులు చేసుకుంటూ తప్పించుకుంటూ వున్నారు. మే 2వ తేదీన పోలీసులు ఈ తప్పించుకున్నవారి భార్యలనూ, చిన్నపిల్లలనూ అరెస్టుచేసి తీసుకుపోయి అక్రమంగా నిర్బంధించారు. పూర్తిగా చట్టవ్యతిరేకమైన ఈ చర్యను దాచిపెట్టే ప్రయత్నంకూడా పోలీస్ అధికార్లు చేయకపోవడం ఆశ్చర్యంకలిగిస్తుంది.

మే 5వ తేదీ రాత్రి ఇక వీళ్ళను ఎట్లాగయినా అరెస్టుచేయాలని పోలీ

సులు నిర్ణయించుకున్నారు. ఆ రాత్రి గ్రామంలోని సర్పంచ్ వ్యతిరేకవర్గంవారు పోలీసు క్యాంపుమీద రాళ్ళు వేశారని పోలీసులు అంటున్నారు. అటువంటిదేమీ లేదని ముద్దాయిలు అంటున్నారు ఎలాగయితేనేం వెంకటాచలం ఎస్.ఐ. దేవిడ్ గారు, నెల్లూరు రూరల్ సి.ఐ. అంచేరావుగారు ఆ రాత్రి పట్టుదలగా బయలుదేరి ఇడిమేపల్లికి పోయారు. 6వ తేదీ తెల్లవారుతుండగా గ్రామం బయట పొలాలలో పండుకున్న సర్పంచ్ ప్రత్యర్థులను అరెస్టు చేయడానికి బయలుదేరారు. వాళ్ళతో బాటు సర్పంచ్ మనుషులుకూడ ఉండటమే పోలీసుల పక్షపాత ధోరణిని సూచిస్తుంది. ఆ రోజు ఉదయం సర్పంచ్ వర్గంవారు వరికుప్పలు కొట్టుకోవాలని నిర్ణయించుకున్నారనీ ఆ సందర్భంలో ఘర్షణ జరగకుండ నివారించడంకోసం తాము వెళ్ళామనీ పోలీసులు అంటున్నారుగానీ ఇదొక కట్టుకథ. సర్పంచ్ వ్యతిరేకవర్గం ఎట్లాగయినా పట్టుకోవాలి వారిని లేదా కాల్చేయాలన్న లక్ష్యంతో పోలీసులు బయలుదేరారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్‌నుండి బయలుదేరుతూ ఎస్.ఐ. దేవిడ్‌గారు "ఈ రోజుతో ఇడిమేపల్లి పని అయిపోతుంది" అంటూ వెళ్ళారని నిర్బంధంలో వున్న స్త్రీలు చెప్పారు.

పొలాలలో పడుకున్న సర్పంచ్ ప్రత్యర్థులను పోలీసులు చాలాదూరం తరిమారు. పోలీసుల కథనంప్రకారం గూడ వాళ్ళు ఎదురుదాడి చేయకుండా చెరువు కట్టవైపు పరుగెత్తారు. అయితే పోలీసులు రెండుగా చీలి చెరువు కట్టమీదినుండి మళ్ళీ వెంబడించారు. పోలీసులు రెండుగా చీలిన సంగతి తెలియని వడ్డెవాళ్ళు పోలీసులమీద దాడి చేశారని అంటున్నారు. ఆయితే ఈ దాడికి సంబంధించిన కథనం పూర్తిగా అసంబద్ధంగా వుంది. వాళ్ళు పోలీసులమీద రాళ్ళు వేశారని ఎస్.ఐ., సి.ఐ. అంటున్నారు. కానీ ఆ ప్రాంతంలో మచ్చుకు ఒక్క రాయి కూడ లేదని ఎవరయినా చూసి తెలుసుకోవచ్చును. వాళ్ళదగ్గర వేరే ఆయుధాలేవీ లేవని ఎస్.ఐ. అంటుండగా, వాళ్ళ చేతులలో గొడ్డళ్ళు, బరిసెలు తదితర ఆయుధాలున్నాయని సి.ఐ అంటాడు. వాళ్ళు మధు అనే కానిస్టేబుల్‌ను కొడవలితో నడుంమీద గాయపరచి అతని తుపాకి లాక్కున్నారని సి.ఐ అంటున్నాడు. అయితే మధు గాయపడిన తరువాతకూడ తన తుపాకితో కాల్పులు జరిపాడని ఎస్.ఐ అంటున్నాడు. మధు కాల్పులు జరిపాడని జనంకూడా అంటున్నారు.

పోలీసులమీద దాడి అనేది కట్టుకథ. రాళ్ళు వేయడానికి అక్కడ రాళ్ళు లేవు. వాళ్ళ చేతుల్లో సరియైన ఆయుధాలూ లేవు. గ్రామంలో ఇరువర్గాల ఘర్షణలో మొదటినుండీ సర్పంచ్ పక్షం తీసుకున్న పోలీసులు ఉద్దేశపూర్వకంగా కాల్పులు జరిపి ముగ్గుర్ని చంపారు.

ఆ తరువాత కనీసం గ్రామస్తులను పిలిచి శవాలను చూపించలేదు. చనిపోయింది ఎవరో తెలియక గ్రామస్తులు చాలా ఆవేదనకు లోనయ్యారు. ఆ ఆవేదనతో ఈసారి నిజంగానే పోలీసులమీద రాళ్ళు రువ్వారు. అయినా బంధువులకు చూపించకుండానే పంచనామా ముగించి శవాలను పోస్ట్‌మార్టంకు తరలించారు.

## అప్పాపురం (గుంటూరుజిల్లా)

తుఫానుకు దెబ్బతిన్న అప్పాపురం గ్రామం గుంటూరుజిల్లా కాకుమాను మండలంలో వున్నది. ఈ గ్రామంలో రెండు ముఠాలు (కాంగ్రెస్, తె.దే.) ఉన్నా రెండిటి మధ్య చాలాకాలంగా వైషమ్యాలున్నా ఏనాడూ బలప్రయోగం జరగలేదు. ప్రతిసారీ పెద్దల జోక్యంతో వైషమ్యాలు బలప్రయోగ స్థాయికి రాకుండా సద్దుమణిగేవి. తుఫాన్ బాధితుల వివరాలు సేకరించే ఎన్యూమరేటర్లు జాబితాలనుంచి తమవర్గం పేర్లు తీసేస్తున్నారని, ఎవరికివారు భావించారు. తెలుగుదేశం వారిపేర్లు కాంగ్రెస్ సర్పంచ్ చెప్పినమీదట తొలగించారని మే 18న ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి (తె దే.) కొల్లా ప్రభుదాస్ కాకుమాను యం.ఆర్.ఓ.కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కొల్లా ప్రభుదాస్‌కు కొందరు కాంగి వర్గీయులకు మధ్య ఘర్షణ జరిగింది. రాత్రికి ఇరువర్గాలూ మోహరించగా పెద్దలు వారిని శాంతపరచి పంపేశారు.

రాత్రి 10 గంటలకు గ్రామ నడిబొడ్డున వున్న దేవాలయం ముందు ఇరువర్గాల పెద్దలు సమావేశమయ్యారు. గ్రామ సర్పంచ్ కూడా సమావేశానికి రాబోతున్నాడు. ఆ సమయంలో కాకుమాను పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు షేక్ వలి, జె.రమేష్‌లు తుపాకులతో, లాఠీలతో సమావేశ స్థలానికి చేరుకున్నారు. పెద్దలకు సహకరించాల్సిన పోలీసులు ఒక్కసారిగా వారిమీదపడి బూతులు తిడుతూ అవమానపరుస్తూ లాఠీఛార్జీ చేశారు. "మీరేనేరా పెద్దలు. తీర్పు చెప్తార్రా మీరు" అంటూ ఇష్టమొచ్చినట్టు మాట్లాడి దౌర్జన్యానికి దిగారు. తాము పెద్దలమని, సర్ది చెప్పేందుకు అక్కడికి వచ్చామని చెపుతున్న చింతల సుబ్బారావుపైకి వెళ్ళి ఘర్షణ పడ్డారు. కానిస్టేబుల్ జె. రమేష్ తన తుపాకిని అతనిపైకి ఎక్కుపెట్టి కాల్చగా సుబ్బారావు ఛాతీలోంచి తుపాకీతూటా దూసుకుపోయి నేలకూలిపోయాడు. తన తమ్ముడి అరుపులు విని అతని దగ్గరకు వస్తున్న అతని అన్న చింతల వెంకటేశ్వర్లుపై రమేష్ మరో రెండు కాల్పులు జరిపి అతన్నికూడా నేలకూల్చాడు. వెంకటేశ్వర్లు ప్రాణం అక్కడే పోగా, బాపట్ల ఆస్పత్రికి తీసుకువెళ్ళే దారిలో సుబ్బారావు మరణించాడు.

సంఘటన అనంతరం తుపాకులతో వలి గ్రామసర్పంచ్ ఇంట్లో వుండగా రమేష్ కాకుమానువెళ్ళి తెల్లవారుజామున ఎస్.ఐ.తో యం.ఆర్.వో.తో జీప్‌లో వచ్చి వలిని, తుపాకులను తీసుకొని బాపట్లలో వున్న సి.ఐ. ఇంటికి వెళ్లాడు. అప్పాపురంకు తెల్లవారుజామున వెళ్ళిన యం.ఆర్.వో.గానీ, ఎస్ ఐ.గానీ కాల్పుల్లో గాయపడ్డవారి యోగక్షేమాలను విచారించే ప్రయత్నం ఏమాత్రం చేయలేదు. చని పోయినవారి బంధుమిత్రులు మరురోజు ఉదయాన్నే బాపట్ల వెళ్ళి సి.ఐ ఇంటికి వెళ్ళి ఫిర్యాదు చేశారు. తర్వాత పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. మొదటిది కానిస్టేబుళ్ళపై హత్యకేసు. కేసులు నమోదు చేసినా కానిస్టేబుళ్ళను హత్య కేసులో అరెస్టు చేయలేదు.

గ్రామంలో ఘర్షణను విచారించేందుకు వెళ్ళిన కానిస్టేబుళ్ళను హత్య చేసేందుకు ప్రయత్నించి తుపాకీ లాక్కొనగా వారు ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపారని పోలీసు ఉన్నతాధికారులు పూర్తిస్థాయి అబద్దాలు ప్రచారం చేశారు. అంటే కానిస్టేబుళ్ళపై పెట్టిన హత్యకేసును దర్యాప్తు చేయకుండానే వారు నిర్దోషు లని నిర్ధారణ చేస్తున్నారన్నమాట. అంటే అప్పాపురం గ్రామస్థుల ఫిర్యాదును బుట్ట దాఖలుచేసి, గ్రామస్తులపై కానిస్టేబుళ్ళు పెట్టిన హత్యాప్రయత్నం కేసు ప్రాథమిక సమాచార నివేదికను పరిశీలిస్తే వారికి వాటిల్లిన ముప్పు ఏమీలేదని అర్థమౌతుంది. కానిస్టేబుల్ వలిని గ్రామస్తులు కొట్టి తుపాకీ లాక్కుని, దాన్ని ఇవ్వమని అడగ్గా ఇవ్వ నిరాకరించినందున కాల్పులుజరిపామని పోలీసులు తమ ఫిర్యాదులో పేర్కొ న్నారు. వారు చెప్పిందే నిజమనుకున్నా పోలీసులు తుపాకీకోసం తప్ప ఆత్మరక్ష ణార్థం కాల్పులు జరపలేదని అర్థమౌతుంది. ప్రాణాలకు ముప్పువాటిల్లి పారిపో యేందుకు ఎలాంటి అవకాశాలు లేని పక్షంలో ఆ ప్రమాదాన్ని నివారించేందుకు అవసరమైనంత మోతాదులో మాత్రమే బలప్రయోగం చేసేందుకు చట్టం పౌరు అందరినీ అనుమతిస్తోంది. కానీ తుపాకీ లాక్కుంటే దాన్నివ్వమని అడిగి కాల్పులు జరిపి మనిషిని చంపి తుపాకీ లాక్కొనమని ఏ చట్టం చెప్పదు. కాబట్టి అప్పా పురం కాల్పులు ఎలా చూసినా హత్యలు తప్ప మరేమీకావు.

ప్రస్తుతం ఈ హత్యలపై శ్రీ మార్కండేయ కమీషన్‌ఆఫ్ ఎంక్వైరీ విచారణ జరుపుతోంది.

## నంది వడ్డెమాను (మహబూబ్ నగర్ జిల్లా)

మహబూబ్‌నగర్ జిల్లా నందివడ్డెమాను గ్రామంలో జూన్ 7వ తేదీ రాత్రి పోలీసులు కాల్పులుజరిపి హరిజన పెంటయ్యను, తెలుగు గూళ్ళ లక్ష్మయ్యను

చంపారు. కల్లు కాంట్రాక్టర్ల దోపిడీని కాపాడడానికి పోలీసులు రంగంలోకి దిగి న్యాయమయిన ప్రజాపోరాటం మీద నిష్కారణంగా దమనకాండ ప్రయోగించి రెండు ప్రాణాలను బలిగొన్నారు.

నంది వడ్డెమాను పరిసర గ్రామాలలో కొందరు పెద్ద ఎక్సైజ్ కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి సారా, కల్లు కాంట్రాక్టులు తీసుకున్నారు. గియాసుద్దీన్ అనే వ్యక్తి పేరుమీద కాంట్రాక్టు వుంది. నందివడ్డెమాను గ్రామంలో కల్లు, సారా వ్యాపారాలు నిర్వహించే వ్యక్తులు రఘునందన్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, ఆతేటి లక్ష్మి రెడ్డి. ఈ ముగ్గురిని ముందు నిలబెట్టి గియాసుద్దీన్ పేరు మీద బడా కాంట్రాక్టర్లు వ్యాపారం నడుపుతున్నారు.

అయితే చుట్టుపక్కల గ్రామాలలో కల్లు సీసాధర రూ॥ 1-25 కాగా నంది వడ్డెమానులో 1-75 ఉండింది. దీనివల్ల నిరసన తెలుపుతూ ప్రజలు ఓ.పి.డి.ఆర్. నాయకత్వంలో సంఘటితం అయ్యారు. నందివడ్డెమానులో కల్లు ధర మిగిలిన గ్రామాల ధరకు సమానం అయ్యేవరకు గ్రామంలోకి కల్లు రానీయ కూడదనీ ఎవ్వరూ కల్లు తాగకూడదనీ నిర్ణయించుకొన్నారు. ఈ సంకల్పాన్ని విచ్ఛిన్నం చేయడానికి కల్లు కాంట్రాక్టర్లూ పోలీసులూ సమాయత్తమయ్యారు. జూన్ నెల 6వ తేదీన కొంచెం కల్లు గ్రామంలోనికి తీసుకొచ్చి అమ్మే ప్రయత్నం చేసారు. ప్రజలు ప్రతిఘటించేసరికి కాంట్రాక్టర్లు అయిదుగురు గ్రామస్తుల మీద బిజినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఆ అయిదుగురిలో ఒకడయిన బాలయ్య అనే రైతును 7వ తేదీన బిజినేపల్లి పోలీసులు అరెస్టు చేసి తీసుకుపోయారు.

ఆ తర్వాత కల్లులారీని గ్రామంలోనికి తీసుకొచ్చారు. ప్రజలు ఆ లారీని చూడగానే రెచ్చిపోయి దానిని నిలిపివేసారు. ఈ సంగతి తెలిసి బిజినేపల్లి ఎస్.ఐ. కొందరు కానిస్టేబుళ్ళను వెంటపెట్టుకొని నంది వడ్డెమానుకు పోగా, తమ గ్రామస్థుడయిన బాలయ్యను వదిలిపెడితేనే తాము లారీని వదిలిపెడతామని జనం అన్నారు. నేనుపోయి బాలయ్యను తీసుకొస్తానని హామీ యిచ్చి బిజినేపల్లి ఎస్.ఐ. వెళ్ళిపోయాడు. అప్పటికి మధ్యాహ్నం అయింది.

ఆ విధంగా వెనక్కి వెళ్ళిన ఎస్.ఐ. ఆ సాయంత్రం కల్లు కాంట్రాక్టరులతో కలిసి విందారగించి, రాత్రి 10-30 గం॥లకు ఒక ప్రైవేట్ జీపులో సాయుధ పోలీసులను తీసుకొని నందివడ్డెమానుకు వచ్చాడు. అతనితో బాటు మోటారు సైకిల్ మీద [illegible] పాలెం పేట్ ఎస్.ఐ. కూడా వచ్చాడు. బాలయ్యను తీసుకొని వస్తానన్నావు కదా, ఏడీ అని గ్రామస్తులు బిజినేపల్లి ఎస్.ఐ.ని అడిగారు. నేను అతనిని ఎప్పుడో వదిలి పెట్టాను అని ఎస్.ఐ. సమాధానం చెప్పాడు. వదిలిపెడితే

సీతోబాటు జీపులో ఎందుకు తీసుకురాలేదు అని జనం ప్రశ్నించారు. ఈ వాదోప వాదాలు జరుగుతూండగా, ఎటువంటి కారణం లేకుండానే గోపాల్ పేట ఎస్.ఐ. తన పక్కనున్న కానిస్టేబుళ్ళ చెవిలో కాల్పులు జరపమని ఆదేశం ఇచ్చాడు. ఇద్దరు కానిస్టేబుళ్ళు వెంటనే తుపాకులతో కాల్పులు ప్రారంభించారు.

చిన పెంటయ్య తలలో నుండి బుల్లెట్ దూసుకుపోయి అక్కడికక్కడే చనిపోయాడు. తెలుగుగూళ్ళ లక్ష్మయ్య, కుమ్మరిపల్లి రాములు, చాకలి రాజన్నల ఛాతీ గుండా తూటాలు దూసుకుపోయి తీవ్రంగా గాయపడ్డారు. మాసయ్యకు తొడ లోను, చిన్నయ్య, అవుల చిన్నమ్మలకు ముఖం మీదను బుల్లెట్ గాయాలయ్యాయి. కాల్పులు అయిపోగానే పోలీసులు తమ చర్యను సమర్థించుకోవడానికి తమ మోటార్ సైకిల్‌కు తామే నిప్పుపెట్టి తగలబెట్టి, జీపులో వెళ్ళిపోయారు.

చిన పెంటయ్య వెంటనే చనిపోగా, తక్కిన వారికి పోలీసులు ఎటు వంటి వైద్య సహాయం ఇప్పించలేదు. తెలుగుగూళ్ళ లక్ష్మయ్యను అతని బంధు మిత్రులే ఎడ్లబండి మీద పాలెం, నాగర్ కర్నూల్ ఆస్పత్రులకు తరలించి, అక్కడి నుండి మహబూబ్ నగర్‌కూ హైదరాబాద్‌కూ కూడా తీసికెళ్ళారు. కానీ అతను బ్రతకలేదు. పోలీసులు వెంటనే కనీసం వైద్య సహాయం అందించి ఉంటే అతని ప్రాణాలు దక్కేవేమో.

పూర్తిగా శాంతియుతంగా, న్యాయంగా జరుగుతూన్న ఆందోళనను అణచడానికి కల్లు కాంట్రాక్టర్ల ప్రాబల్యానికి లోనయిన పోలీసులు చేపట్టిన ఈ దౌర్జన్యకాండను సమర్థించుకోవడానికి జిల్లా ఎస్.పి. ఒక కట్టు కథ అల్లి ప్రజలు 'తీవ్రవాదుల' ప్రభావంలో లారీమీద, కల్లు కాంట్రాక్టరు మీద, పోలీసుల మీద దౌర్జన్యం చేసారని పత్రికా ప్రకటన ఇచ్చాడు.

## కమలాపూర్ [కరీంనగర్ జిల్లా]

చెన్నారెడ్డి హయాంలో ఇప్పటివరకు జరిగిన అన్ని కాల్పులూ మినహా యింపు లేకుండ నిష్కారణమయినవే. అయితే జూన్ 11 వ తేదీన కరీంనగర్ జిల్లా కమలాపూర్‌లో జరిగిన కాల్పులంత నిష్కారణమయినవి బహుశా వేరేలేవు.

కమలాపురం గ్రామం కరీంనగర్ జిల్లాలో వుందిగానీ వరంగల్ జిల్లాకు బాగా దగ్గర. వరంగల్ జిల్లాకు చెందిన యెల్లాపూర్ గ్రామం కమలాపురంకు 15

కి.మీ.ల దూరాన వుంది. ఆ గ్రామానికి చెందిన మజ్జిగ కొమురమ్మ (16) అనే అమ్మాయి కమలాపురం సమీపంలోని కానిపర్తికి తన అక్కగారిని చూడటానికి వెళ్ళింది. అక్కడి నుండి జూన్ 11 వ తేదీన సినిమా చూద్దామని కమలాపూర్ బయలుదేరింది. ఆమెతో ఆమె పొరుగింటి వాడయిన నజీర్ అనే యువకుడు ఉన్నాడు. మార్నింగ్ షో చూద్దామని 12 గంటల ప్రాంతంలో సినిమాటాకీస్ చేరుకున్నారు. 'హౌస్‌ఫుల్' అని తెలిసింది. ఏం చేద్దామా అని ఇద్దరూ రోడ్డు పక్కన నిలబడ్డారు. ఆ స్థితిలో వాళ్ళు ప్రకాష్ అనే పోలీస్ కానిస్టేబుల్ కళ్ళ బడ్డారు.

కమలాపురానికి పోలీస్‌స్టేషన్ కొత్తగా వచ్చింది. ఆర్.అండ్ బి వారి గెస్టుహౌస్‌లో నెలకొల్పారు. ప్రకాశ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి కొత్తగా వచ్చాడు. అతను కొమురమ్మ నజీర్‌లను సమీపించి ఒక 20 రూ॥ల కాగితం ఇచ్చి సిగరెట్లు తెమ్మన్నాడు. నజీర్ అటు పోగానే దగ్గరలో వున్న ఒక గదిలోకి కొమురమ్మను తీసుకుపోయాడు. తిరిగి వచ్చిన నజీర్ విషయాన్ని గ్రహించి లబోదిబో మంటూ సెంటర్‌లో నిలబడ్డ యువకులను సమీపించాడు. ఒక కానిస్టేబుల్ ఒక అమ్మాయిని బలవంతంగా గదిలోకి తీసుకుపోయాడనీ ఆ అమ్మాయిని కాపాడవలసిందనీ అన్నాడు. ఆ అమ్మాయి ఎవరు ? అని వాళ్ళు అడగగా, వాళ్ళను త్వరగా కదిలించే ఉద్దేశ్యంతో 'నా చెల్లెలు' అని సమాధానం చెప్పాడు. తరువాతి దినం పత్రికలలో కూడ వాళ్ళిద్దరు అన్నాచెల్లెళ్ళు అని రావటానికి ఇదే కారణం.

అక్కడున్న 7-8 మంది యువకులు వెంటనే కదిలి ఆ గది దగ్గరికి వెళ్ళారు. తలుపులు పగలగొట్టి ప్రకాశ్‌నూ కొమురమ్మనూ బయటికి లాగారు. నగ్నంగా వున్న ప్రకాశ్‌ను యువకులు పట్టుకొని ఏం చేయాలా అని ఆలోచిస్తూ వుండగా ప్రకాశ్ వాళ్ళ చేయి కొరికి పారిపోయి పోలీసు స్టేషన్‌లో తల దాచుకున్నాడు. కమలాపురం ఎస్.ఐ. ఆరోజు ఫూళ్ళో లేడు. ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్, సెంట్రీ వున్నారు. యువకులు పోలీస్ స్టేషన్ దగ్గరకి పోయి ప్రకాశ్‌ను తమకు అప్ప చెప్పాలని పట్టు బట్టారు. సెంట్రీవాళ్ళతో వాదన పెట్టుకొని వీలులేదన్నాడు. యువకులు ఇంకా పట్టుబట్టేసరికి సెంట్రీ గాలిలోకి కాల్పులు జరిపాడు. వైర్‌లెస్ మీద హుజూరాబాద్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కృష్ణారావుకు వర్తమానం పంపారు. సి.ఐ. అక్కడికి వచ్చేసరికి మధ్యాహ్నం 2-30 అయింది. సరిగ్గా అప్పుడే మార్నింగ్‌షో వదిలిపెట్టారు. జనం పెద్ద సంఖ్యలో పోలీసుస్టేషన్ దగ్గర గుమిగూడారు.

పోలీసులకే వదిలిపెడితే కానిస్టేబుల్‌ను ఎప్పటికీ శిక్షించడం జరగదనీ, కాబట్టి ప్రకాశ్‌ను తమకు అప్పజెప్పాలనీ తామే ప్రజా పంచాయితీ జరిపి శిక్షిస్తామనీ జనం డిమాండ్ చేసారు. అది చట్ట వ్యతిరేకమైన కోరికే కావచ్చును కానీ ప్రజలకు పోలీసుల పట్ల వున్న అవిశ్వాసానికి చక్కగా అద్దం పడుతుంది. ప్రజల మీద అత్యాచారాలకు పాల్పడిన పోలీస్ అధికార్లను ఈ దేశంలో ఎన్నడూ శిక్షించడం జరగలేదన్నది కాదనలేని వాస్తవం. అటువంటి పరిస్థితిలో సి.ఐ. వెంటనే ఆ కానిస్టేబుల్‌ను అతను దాక్కున్న గదిలో నుండి బయటకితీసి లాకప్పులో పెట్టి, కొమరమ్మ నజీర్‌లను జనం ముందే విచారించాలి. వాళ్ళ వాంగ్మూలాలు రికార్డు చేసుకొని, గది తలుపులు పగలగొట్టిన యువకుల స్టేట్‌మెంట్లు కూడా రికార్డుచేసి అప్పటికప్పుడే రిమాండ్ రిపోర్టు తయారుచేసి జనాన్ని కూడా హుజూరాబాద్ తీసుకుపోయి వాళ్ళ సమక్షంలోనే రిమాండ్ చేయించి ఉంటే, పరిస్థితి చేయి దాటి పోయేదికాదు. కాని అంతటి సంయమనం, అంతటి ప్రజాస్వామిక వైఖరి మన పోలీసుల కెక్కడిది ? అందులోనూ కరీంనగర్ పోలీసులు తమలో ఒకడిని ప్రజలే శిక్షిస్తామని అంటూ వుంటే సహిస్తారా ? కాబట్టి సి ఐ. మొండిగా జనాన్ని వెళ్ళిపొమ్మని అంటూ కూర్చున్నాడు. దాదాపు రెండు గంటలసేపు చర్చలు జరిగాయి. పోలీస్‌స్టేషన్‌గా ఉపయోగిస్తూవున్న కట్టడం ఆవరణలో ఒక పక్క దాదాపు రెండు మూడు వందల మంది జనం, ఒక పక్క సి.ఐ. కృష్ణారావు కూర్చున్నారు. జనానికి దాడిచేసి ప్రకాశ్‌ను చేజిక్కించుకునే ఉద్దేశ్యం ఉంటే సి.ఐ. రాకముందే ఆ పని చేసి ఉండేవారు. అటువంటి ఉద్దేశ్యమేమీ లేకపోగా, జనం ఫోటోగ్రాఫర్‌ను కూడా పిలిపించి తమ చర్చలను ఫోటో తీయించారు.

విచిత్రమేమిటంటే ముద్దాయి ప్రకాశ్‌ను కనీసం లాకప్పులో పెట్టే ప్రయత్నం కూడ సి ఐ. కృష్ణారావు చేయలేదు. చేయకపోగా వేరే కానిస్టేబుల్ అతనికి డ్రెస్ తీసుకొచ్చి ఇచ్చాడు. అతను డ్రెస్ వేసుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఉండే తుపాకీని తీసుకున్నాడు. బయట ఆవరణలో సి. ఐ.తో మాట్లాడుతున్న జనం మీదికి నేరుగా గురిపెట్టి కాల్పులు జరిపాడు. సుజాత, కవిత, పుష్పలత అనే ముగ్గురు అమ్మాయిలకు గాయాలయ్యాయి. జనం బాగా రెచ్చిపోయారు. నీతో మేము మర్యాదగా మాట్లాడుతూ వుంటే అతను కాల్పులు జరుపుతాడా అని కాలర్ పట్టుకొని అడిగారు. సి.ఐ. కాల్పులు జరపమని ఆర్డర్ ఇచ్చాడు. అప్పుడు వేరే కానిస్టేబుల్ కాల్పులు ప్రారంభించాడు. మరొక 9 మందికి గాయాలయ్యాయి. అల్లమల్లయ్య (50) అనే వ్యవసాయకూలీ చనిపోయాడు.

ఆ తరువాతే జనం రెచ్చిపోయి కొంత విధ్వంసానికి పాల్పడ్డారు. పోలీసులు దాన్ని మూడు రెట్లుచేసి లైట్లూ, అద్దాలూ, కుర్చీలూ, ఫైళ్ళూ, కిటికీలూ,

తలుపులూ, బోర్డు అన్నీ ధ్వంసం అయినట్లు సాక్ష్యం సృష్టించి 20 మంది యువకుల మీద కేసుపెట్టి కూర్చున్నారు.

## కొల్లాపూర్ (మహబూబ్‌నగర్ జిల్లా)

జూన్ 20వ తేదీన రాడికల్స్ ఎన్‌కౌంటర్లకు నిరసనగా నిర్వహించిన తెలంగాణా బంద్ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ సమీపంలో వాళ్ళు మహమ్మద్ మజహరుద్దీన్ అనే ఆర్.టి.సి. డ్రైవర్‌ను చంపినట్లు వార్త వచ్చింది. స్టీరింగుమీదనే డ్రైవర్‌ను కాల్చేసారని ఒక ప్రకటన, లేదు డ్రైవర్‌ను క్రిందికి దింపి అడవులలోకి తీసుకుపోయి హత్యచేసారని మరొక ప్రకటన పోలీసులు ఇచ్చారు. కానీ నిజానికి పోలీసులకూ రాడికల్స్‌కూ మధ్యన జరిగిన కాల్పులలో పోలీసుల బుల్లెట్ తగిలి చనిపోయాడు. ఉద్దేశపూర్వకంగా చేసిన హత్య కాదు కాబట్టి పోలీసులు వాస్తవాన్ని ప్రకటించినా వాళ్ళను ఎవరూ ఏమీ అనేవారు కాదు. కాని జిల్లా ఎస్.పి. అనురాగ్‌శర్మగారు పనిగట్టుకొని అబద్ధాలు ప్రచారం చేసారు.

నిజం చెప్పగల వ్యక్తి బస్ కండక్టర్ గంపా అబ్రహాం ఒక్కడే. ఎందుకంటే అది ప్రయాణికులను తీసుకుపోతున్న బస్సు కాదు. అందులో సామాన్య ప్రయాణికులెవ్వరూ లేరు. అది పోలీసులు రిక్విజిషన్‌చేసి అరువు తీసుకున్న బస్సు. అందులో పోలీసులూ, డ్రైవరూ, కండక్టరూ మాత్రమే ఉన్నారు. కండక్టర్ అవసరం మట్టుకు ఏముందిగానీ, ఒక్కొక్క స్టేజీ దగ్గరా రొటీన్‌గా ఎస్. ఆర్. నింపటం కోసం అతన్ని పంపించారట.

వనపర్తి డిపోనుండి 19వ తేదీ మధ్యాహ్నం బస్సు 16 మంది సాయుధ పోలీసులను తీసుకొని కొల్లాపూర్‌కు పోయింది. అక్కడినుండి జొన్నలబోడకు పోయి అక్కడ కొందరు పోలీసులను దింపి కేవలం ఆరడజను మంది పోలీసులతో తిరిగి కొల్లాపూర్‌కు బయలుదేరింది బస్సు. దారిలో చెన్నంరావుపల్లి కొత్తపేటల మధ్య ఒక కల్వర్టు దగ్గిర కొందరు రాడికల్స్ రోడ్డుకు అడ్డంగా రెండు ప్రైవేట్ బస్సులను నిలబెట్టి ఈ బస్సును ఆపారు. అప్పటికి సాయంత్రం చీకటిపడింది. రాడికల్స్ బస్సు డ్రైవర్‌ను పక్క తలుపు నుండి క్రిందికి దించి, పోలీసులను తీసుకొస్తున్నందుకు తిట్టారు. అయితే అతన్ని కొట్టలేదు. ఎటూ తీసుకుపోలేదు. వాళ్ళు బస్సును తగలబెట్టడానికి సన్నాహాలు చేయసాగారు. వాళ్ళ మాటలు విన్న పోలీసులు బస్సు వెనక భాగంలో వున్న ఎమర్జెన్సీ తలుపునుండి క్రిందికి దిగి

రోడ్డుకు రెండవ వైపుకు వచ్చి నిలబడ్డారు. వాళ్ళకూ, రాడికల్స్‌కూ మధ్య కాల్పులు జరిగాయి. కండక్టర్ భయపడి అక్కడున్న ఒక ప్రైవేట్ బస్సు క్రింద దాక్కున్నాడు. ప్రైవేట్ బస్సులలోని జనం కూడా భయం భయంగా చీకటిలో కూర్చున్నారు. ఒక 30 నిమిషాల తరువాత 'అల్లా బచావ్'! (దేవుడా కాపాడు) అని డ్రైవర్ అరవడం కండక్టర్ విన్నాడు. ఆ తరువాత ఒక 10 నిమిషాలపాటు అతని అరుపులు వినబడుతూనే ఉన్నాయి. రాడికల్స్‌వైపు ఉన్న డ్రైవర్ రోడ్డు దాటి పోలీసుల వైపుకు పోయి కొంచెం ఎడంగా రోడ్డు పక్కన పడిపోయాడు. దాదాపు అరగంట కాల్పులు జరిగాక జొన్నలబోడ దగ్గర దిగిపోయిన పోలీసులు తిరిగి వచ్చారు. రాడికల్స్ వెళ్ళిపోయారు. ప్రైవేట్ బస్సుల లైట్లువేసి చూడగా డ్రైవర్ చనిపోయి పడివున్నాడు. ఒక బుల్లెట్ అతని ఎడమచేతి అరచేతిగుండా దూసుకుపోయి కడుపు కుడివైపు శరీరంలోనికి చొచ్చుకుపోయింది. అధిక రక్తస్రావం వల్ల చనిపోయాడు.

పోలీసులకూ రాడికల్స్‌కూ కాల్పులు మొదలయినప్పుడు రాడికల్స్ దగ్గరున్న డ్రైవర్ కొంత సేపటికి రోడ్డుదాటి అటువైపు పారిపోవాలని ప్రయత్నించి నట్టున్నాడు. అప్పుడు బుల్లెట్ తగిలింది. రాడికల్స్ కాల్చిన బుల్లెట్ అయితే వెనుక నుండి తగిలి ఉండాలి. పోలీసులు కాల్చినది కాబట్టి ముందునుండి తగిలింది. పరుగెత్తుతూ కడుపుకు చేయి అడ్డం పెట్టుకున్నట్టున్నాడు. అరచేతి నుండి బుల్లెట్ కడుపులోకి దూసుకుపోయింది. ఆ తరువాత అతను 'అల్లా బచావ్' అంటూ 10 నిముషాలు పడివున్నా పోలీసులు పట్టించుకోలేదు. వెంటనే పట్టించుకొని వుంటే ప్రాణం దక్కేదేమో. ఆ ప్రయత్నం చేయకపోగా అబద్ధపు కథలల్లి ప్రచారం చేయడంలో పోలీసులు నిమగ్నమయ్యారు.

## గొట్టిపడియ [ప్రకాశంజిల్లా]

పోలీసు కాల్పుల్లో సామాన్య ప్రజల మరణవార్తలను పత్రికలు తమ మారుమూలల్లోకి నెట్టేస్తున్న రోజులు కనుక ప్రకాశంజిల్లా మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామంలో 2-8-90నాడు జరిగిన పోలీసు కాల్పులు, కొష్ఠం దేవదాసు మృతివార్త చాలామంది దృష్టికి రాకుండానే అనామకంగా సమాధి అయిపోయింది. దినపత్రికల్లో ఆ వార్త చదివినవాళ్ళు కూడా అదేదో పీర్లపండగ గొడవ అనుకున్నారు కాని పోలీసులు మరో సజీవ ప్రాణిని పీనుగుని చేశారనుకోలేదు. గొట్టిపడియ 400 గడప మాత్రమే ఉన్న చిన్న గ్రామం. అన్ని కులాలవాళ్లూ ఉన్నారు.

కాని రెడ్లది పైచేయి. మొదట్నించి రెండు గ్రూపులున్నాయి. అయితే కొట్లాటలు, హత్యలదాకా ఎప్పుడూ రాలేదు. 1988 పంచాయితీ ఎన్నికల్లో చెంచిరెడ్డి, కొండా రెడ్డి సర్పంచ్ పదవికై పోటీపడ్డారు. చెంచిరెడ్డి గెలిచాడు. అప్పటి నుండి ఈ రెండు గ్రూపుల మధ్య పరస్పర ఆరోపణలు ఎక్కువయ్యాయి. చెంచిరెడ్డి గ్రామం లోని పోరంబోకులో 250 ఎకరాల బత్తాయితోట వేశాడని కొండారెడ్డి పిటిషన్లు పెట్టి ఆ భూమి అతని స్వాధీనంలో నుండి తొలగించడానికి ప్రయత్నించగా చెంచిరెడ్డి కోర్టులో దావా వేశాడు.

ఈ నేపథ్యంలో ఆగస్టు 1వ తేదీ రాత్రి ఊర్లో పీర్ల ఊరేగింపు జరుగుతున్నపుడు కొండారెడ్డి మేనల్లుడు బచ్చు వెంకటనారాయణ మేళం వాయించే వాళ్ళతో గొడవపడ్డాడు. సంప్రదాయ సంగీతం వద్దని, సినిమా పాటలు వాయించ మని అడిగాడు. అక్కడి నుండి తగువు మొదలై రెండు గ్రూపుల మధ్య ఘర్షణ దాకా వెళ్ళింది. ఆ రాత్రి ఆర్ టి.సి బస్సులో ఎస్కార్టుగా వచ్చిన కానిస్టేబుల్ వెంటనే బస్సు తీసుకుని మార్కాపురం వెళ్ళి రూరల్ ఎస్.ఐ.కు రిపోర్టు చేశాడు.

ఆయన సి.ఐ. నేతృత్వంలో ఇద్దరు సాయుధులైన కానిస్టేబుళ్ళను, ఇద్దరు హోంగార్డులను వెంటతీసుకుని రెండవతేదీ తెల్లవారుజాము 4 గంటలకు గొట్టిపడియ వచ్చాడు. సి.ఐ, ఎస్.ఐ. లిద్దరూ ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఉదయం ఏడుగంటల దాకా పరిస్థితి ప్రశాంతంగానే ఉండింది. ఏడు గంటలకు మళ్ళీ గొడవ మొదలై రెండు వర్గాలవాళ్ళు రాళ్ళు రువ్వుకున్నారు. ఎస్.ఐ. కొండారెడ్డి వర్గం వాళ్ళను నెట్టుకుంటూ తీసికెళుతుంటె సి.ఐ. తన వంతుకు వచ్చిన చెంచిరెడ్డి వర్గం వాళ్ళను 'చెల్లా'చెదరు చేయడానికి ఏకంగా కాల్పులు ప్రారంభించాడు. లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగం, గాలిలోకి కాల్పులు, ముందుగా హెచ్చరికలు, మేజిస్ట్రేటు అనుమతి మొదలైన ఏ నిబంధనలూ పాటించకుండా తుపాకి పట్టుకున్న చేతికి చేతినిండా పని కల్పించాడు. పాతికేళ్ళ రొట్టం దేవదాసు, ఉరఫ్ దేవిరెడ్డి, 20 ఏళ్ళ తుమ్మి వెంకటనారాయణ, 18 ఏళ్ళ గోపు రామయ్య, 22 ఏళ్ళ బుర్రి వెంకటసుబ్బయ్యకు తూటా గాయాలయ్యాయి. అనంతరం గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో రొట్టం దేవదాసు మరణించాడు. ఒక్క వెంకటనారాయణకు మినహా మిగతా ముగ్గురికీ నడుం పైభాగానే గాయాలయ్యాయి. శరీరం కింద భాగంలో కదా కాల్పులు జరపాల్సింది అని మనం అడిగితే కనక 'బుల్లెట్లకు రూల్స్ ఏం తెలుస్తాయి' అని చెప్పి ఉండేవాళ్ళేమో! తుపాకి పట్టుకున్న వాడికే తెలియనపుడు, నిజమే వాటికి మాత్రం ఎలా తెలుస్తాయి!!

కాల్పులు జరగాల్సిన పరిస్థితి అక్కడ లేనేలేదనేది స్పష్టం. రాళ్ళు విసురుకుంటున్నారేగాని ఎవరికీ రాళ్ళ దెబ్బలు కూడా తగలలేదని గ్రామస్తులు

చెప్పారు. ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపామని చెప్పడానికి వాళ్ళూ, వీళ్ళూ కూడా పోలీసులమీద తిరగబడలేదు. కాల్పులు జరపాల్సిన అవసరం నిజంగానే వచ్చి ఉంటె సాయుధులైన ఇద్దరు కానిస్టేబుళ్ళను వెంట తీసికెళ్ళిన సి.ఐ. వాళ్ళను కాల్పులు జరపాల్సిందిగా ఎందుకు ఆదేశించలేదు? ఈ ఒక్క కారణం చాలు ప్రాణాంతకమైన సి.ఐ. తొందరపాటుతనాన్ని రుజువు చేయడానికి. అందుకే ఈ ప్రశ్నకు పోలీసుల నుండి ఇంతవరకు హేతుబద్ధమైన సమాధానం లేదు. అవసరమైందని ఎస్.ఐ. సమర్థించే ప్రయత్నం చేస్తాడు కాని ఎలా అవసరమయిందో చెప్పడు. రాళ్ళు రువ్వుతుంటున్న జనాన్ని చెదరగొట్టడానికి మంచి మాటలు సరిపో లేదంటె నమ్మొచ్చుగాని తూటాలు తప్ప మార్గం లేదని సి.ఐ. పేరయ్యగారు తను నమ్మడమేకాక మనల్ని కూడా నమ్మమంటె ఎలా?

## పాపగల్లు [మహబూబ్‌నగర్ జిల్లా]

పాపగల్లు గ్రామం తాండూరు మండలంలోనే ఒక మారుమూల గ్రామం రాజకీయంగా, సాంఘికంగా చాలా వెనకబడ్డ గ్రామం. సెప్టెంబర్ నెలలో ఒక దినం ఊరి ప్రజలందరూ సమావేశమయి వారం దినాలగా గ్రామంలో ఎవరో చేతబడి చేస్తున్నారనీ నిమ్మకాయలూ పసుపుకొమ్ములూ గ్రామంలో కనిపిస్తున్నాయనీ చెప్పి, అందుకు బాధ్యత అంజయ్య అనే వ్యక్తిదే అయివుండాలని నిర్ణయించారు. అతనిని గ్రామం మధ్యకు పిలిపించి పంచాయితీ నిర్వహించారు. అతనిమీద వాళ్ళు తొందరపడి చేయి చేసుకోలేదు. పంచాయితీ ఉదయం నుండి సాయంత్రం దాకా సాగింది.

అయితే అంజయ్యను గ్రామస్తులు తీసుకుపోతుండడం చూసిన అతని బావమరిది పోలీసులకు కబురు చేశాడు. సాయంత్రం 3, 4 మధ్య పోలీసులు గ్రామంలోనికి వచ్చి పంచాయితీ చేస్తున్నవారిపై లాఠీచార్జి చేశారు. జనం ఎక్కడి వారక్కడ చెల్లాచెదరయిపోయారు.

అదే సమయంలో శేఖరరెడ్డి, బొందిరెడ్డి అనే యువకులు, చనిపోయిన తమ బంధువు అంత్యక్రియలు ముగించి ఊళ్ళోకి వస్తున్నారు. వాళ్ళతో మరికొంత మంది కూడ ఉన్నారు. గ్రామం సమస్యను గ్రామస్తులు పరిష్కరించుకుంటుంటే మధ్యన పోలీసుల జోక్యం ఎందుకని అడగడానికి వాళ్ళు పోలీసుల దగ్గరికి గుంపుగా పోయారు. వాళ్ళు తమమీద దాడి చేయడానికి వస్తున్నారని పోలీసులు భావించారేమో, వెంటనే హెచ్చరిక లేకుండ, నేరుగా కాల్పులు జరిపారు. శేఖర్‌రెడ్డి అక్కడికక్కడే చనిపోయాడు: బొందిరెడ్డికి గాయం అయింది.

పోలీసుల కథ ఎప్పటివలె వేరుగా వుంది. మూఢ నమ్మకాలకు బలి కాకుండ అంజయ్యను కాపాడి బయటకు తేవాలని తాము ప్రయత్నిస్తూవుంటే ప్రజలు తమమీద దాడి చేసి తుపాకులు లాక్కునే ప్రయత్నం చేశారనీ, జీపు అద్దాలు పగలగొట్టారనీ అందువల్ల ఆత్మరక్షణకోసం ఎదురుకాల్పులు జరపవలసివచ్చిందనీ పోలీసులు ప్రకటించారు. ఇందులో మొదటి భాగం వాస్తవం కావచ్చునుగానీ రెండవ భాగం అబద్ధం. మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి, కొంతవరకు నిజామాబాద్ జిల్లాలలో చేతబడి మీద నమ్మకం విస్తృతంగా వుంది. ఎంతోమంది అమాయకులను ఈ మూఢనమ్మకం బలితీసుకుంది. ఈ మూఢనమ్మకాన్ని అడ్డం పెట్టుకొని చాలా గ్రామాలలో పెత్తందార్లు అధికారానికి అడ్డం వచ్చిన పేదలను 'చేతబడి చేస్తున్నారు' అనే మిషమీద చంపిస్తున్నారు. కాబట్టి అంజయ్యను కాపాడటం వరకు పోలీసులు మంచిపనే చేశారు. అయితే కాల్పులు జరిగింది ఆ తరువాత. పగిలాయని చెప్తున్న జీపు అద్దాలు కూడ ఊరిబయట పడిఉన్నాయి తప్ప పంచాయితీ జరిగిన స్థలంలో గాజు పెంకులేవీ లేవు. గ్రామ సమస్యలలో నయినా కుటుంబ సమస్యలలోనయినా జోక్యం చేసుకొని చావగొట్టి చెవులు మెలేసి పరిష్కరించడం తమ విధిగా భావించే పోలీసులు, శేఖరరెడ్డి తదితరులు తమను ప్రశ్నించడాన్ని సహించలేకపోయారు. వాళ్ళమీద లాఠీచార్జీ చేయడంగానీ ఇతరత్రా చెదరగొట్టటంగానీ గాలిలోకి కాల్పులు జరపడంగానీ అనవసరం అని భావించి నేరుగా ఛాతీలమీదికి కాల్పులు జరిపి శేఖరరెడ్డిని చంపారు. జీపు అద్దాలు ఆ తరువాత పోలీసులే పగలగొట్టుకొని వున్నా ఆశ్చర్యపోనవసరంలేదు.

ఈ సంవత్సరం అడ్డూ ఆపూ లేకుండ జరుగుతున్న పోలీసు కాల్పుల జాబితాలోకి పావగల్లు కూడ చేరింది.

## ఖిలాఘనపురం [మహబూబ్‌నగర్ జిల్లా]

అద్వానీ 'రథయాత్ర' ఫలితంగా దేశమంతటా ప్రజ్వరిల్లిన మతోన్మాదం మసీదుల, దర్గాల, ఈద్గాల విధ్వంసనానికి దారితీసింది. మన రాష్ట్రంలో ప్రధానంగా రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలలో ఈ రకమయిన విధ్వంసనం విస్తారంగా జరిగింది. చాలాచోట్ల ముస్లింలమీద భౌతిక దాడులు కూడ జరిగాయి. ఒక్క హైదరాబాద్ నగరం మినహాయిస్తే వేరే ఎక్కడా ముస్లింలు ప్రతిఘటించలేకపోయారు. అయితే మహబూబ్‌నగర్ జిల్లాలోని మండల కేంద్రం అయిన ఖిలాఘనపురంలో మట్టుకు ముస్లింలకు సాధ్యపడని ప్రతీకారం ముస్లిం మతస్తు

లయిన ఎస్.ఐ దస్తగిర్ ఖాన్, సి.ఐ. ఎం.ఏ. ఖాన్ తమ అధికార బలాన్ని ఉపయోగించుకొని సాధించారు.

అక్టోబర్ 23వ తేదీన బీహార్‌లో ప్రభుత్వం అద్వానీని అరెస్టు చేసింది. ఆ వార్త తెలియగానే ఖిలాఘనపురంలో హిందూ మతోన్మాదులు ఊళ్ళోని మసీదు మీద, ముస్లింల దుకాణాలమీద రాళ్ళువేశారు. 144 సెక్షన్ ప్రకటించబడింది. 24వ తేదీన పక్కనేవున్న సాలీపురంలో మసీదును కొంతభాగం ధ్వంసం చేశారు. మానాజీపేటలో ఒక మసీదునూ ఈద్గానూ పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ తరువాత దాదాపు రెండు వారాలపాటు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

నవంబరు 8 సాయంత్రం ఒక కారు గ్రామంలోకి వచ్చింది. అందులో వచ్చిన వ్యక్తి నేరుగా ముస్లింల దగ్గిరికివెళ్ళి ఒక అరగంటసేపు మాట్లాడి వెళ్ళి పోయాడు. ఆయనను ఊరి బయటికి సాగనంపి వెనక్కి వస్తున్న ముస్లిం యువకులు గ్రామపంచాయితీ దగ్గర జనంమీద రాళ్ళు వేశారు. కాంతారెడ్డి అనే కాంట్రాక్టర్‌కు గాయాలయినాయి. అతని వెనుక కొందరు యువకులు గుమికూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగక ముస్లింల దుకాణాలమీద, ఇళ్ళమీద దాడి చేసి దుకాణాలను కూల్చేసి చాలా నష్టం చేశారు. ఇళ్ళమీద రాళ్ళు వేశారు. గ్రామంలోని 50 ముస్లిం కుటుంబాలలో దాదాపు అందరూ దాడికి గురయ్యారు. బషీర్ అనే వ్యక్తి పిండిమిషన్ తగలబెట్టారు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఈ దాడికి నాయకత్వం వహించింది భారతీయజనతాపార్టీ వాళ్ళు కాదు; ఆ మండలంలో బలమైన శక్తిగా వున్న తెలుగు దేశం పార్టీవాళ్ళు. అంత దాడి ఎందుకు చేశారని అడిగితే సమర్థించుకోవడానికి వాళ్ళ నాయకులయిన మండల ప్రెసిడెంట్ వెంకటయ్య, గ్రామ సర్పంచ్ శేషాచారి ఒక కథ తయారుచేసి విస్తృత ప్రచారం చేశారు. ఆ సాయంత్రం ఒక వ్యక్తి కారులోవచ్చి ముస్లింలతో మాత్రం 'రహస్యంగా' మాట్లాడివెళ్ళడంవల్ల హిందువులు భయపడ్డారని వాళ్ళు అంటున్నారు. పత్రికలుకూడా వాస్తవం తెలుసుకునే ప్రయత్నం చేయకుండ, ఎవరో వ్యక్తి వచ్చి రహస్యంగా ముస్లింలకు ఆయుధాలిచ్చి వెళ్ళాడని, హిందువులు భయపడ్డారని రాశాయి. నిజానికి ఆ వచ్చిన వ్యక్తి

ఎవరో అపరిచితుడు కాదు. అతను జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడయిన అబూబకర్. అంతకుముందు రెండు వారాలగా జిల్లాలో కూల్చేసిన మసీదులూ, దర్గాలూ, ఈద్గాల గురించి తన బాధ్యతగా ఆయన వివరాలు సేకరిస్తున్నాడు. చివరిగా ఖిలాఘనపురం వచ్చాడు ఆయన పర్యటనలో రహస్యమేమీ లేదు. ఆయన స్థానిక తెలుగుదేశం నాయకులకు అపరిచితుడూ కాడు.

తనమీద జరిగిన దాడిని గురించి ముస్లింలు ఎస్.ఐ.కి ఫిర్యాదు చేశారు. ఆ మహానుభావుడు కాంతారెడ్డిమీద రాళ్ళేసిన ముస్లింలను, ముస్లింలమీద దాడిచేసిన వారినీ అరెస్టుచేసి రెండు కేసులూ నమోదుచేసివుంటే సరిపోయేది. అందుకు బదులు అతను వనపర్తికి పంపి సి.ఐ.ఖాన్‌నూ, డి.ఎస్.పి. సూర్యప్రకాశరావునూ, సాయుధ పోలీసులనూ రప్పించాడు. వాళ్ళు హిందువుల ఇళ్ళమీదపడి విపరీతంగా జనాన్ని కొట్టారు. మండల ప్రెసిడెంట్, సర్పంచ్ అడ్డంవెళితే వాళ్ళనూ కొట్టారు. బూతులు తిట్టారు. దాదాపు 25 మందికి బాగా దెబ్బలు తగిలాయి. 20 మందిని అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తెచ్చారు. వాళ్ళను వ్యాన్ ఎక్కించే ప్రయత్నం చేస్తుండగా రెండు మూడు వందలమంది జనం వ్యానుకు అడ్డంవెళ్ళారు. పోలీసులు వాళ్ళనూ కొట్టారు. ఉద్రిక్తత పెరుగుతున్న విషయం గమనించిన డి.ఎస్.పి. సర్పంచ్‌నూ, మండల ప్రెసిడెంట్‌నూ వదిలిపెట్టి మిగిలినవాళ్ళను తీసుకువెళ్ళాలని చూశాడు. అయితే వాళ్ళు దానికి ఒప్పుకోక, అందరినీ వదిలిపెట్టాలనీ, వదిలిపెడితే పొద్దున్న అందరూ పోలీస్‌స్టేషన్‌కు స్వచ్ఛందంగా రాగలరనీ హామీ యిచ్చారు. ఆ మాటమీద వాళ్ళను వదిలిపెట్టారు.

9వ తేదీ ఉదయం అరెస్టయిన వాళ్ళతోబాటు జనం పెద్దసంఖ్యలో కదిలారు. మహబూబ్‌నగర్‌కు వెళ్ళి కలెక్టర్‌కు చెప్పాలని వారి ఉద్దేశ్యం. దాదాపు 500 మంది గుమిగూడారు. సి ఐ. వచ్చి అందరినీ వెనక్కి పంపుతారా లేకపోతే కాల్పులు జరపాలా అని గద్దించాడు. జనాన్ని మండల ప్రెసిడెంట్ వెనక్కి పంపుతుండగా ఎస్.ఐ. పక్కసందులోనుండి వచ్చి నేరుగా కాల్పులు జరిపాడని వీళ్ళు అంటున్నారు. చెప్పినమాట వినక జనం పోలీసులమీదనే దాడికి పూనుకున్నారనీ అప్పుడు ఆత్మరక్షణార్థం కాల్పులు జరపవలసి వచ్చిందనీ పోలీసులు అంటున్నారు. తమ చర్యమీద జనం నిరసన తెలపడానికి సమాయత్తం కావడం పోలీసులు సహించలేకపోయారనేది స్పష్టం. ఊళ్ళో సెక్షన్ 144 ఉన్నప్పుడు ఉద్రిక్త పరిస్థితి

ఏర్పడినప్పుడు ఎం.ఆర్.వో.ను పిలిపించడం పోలీసుల విధి. ఆయన వస్తే గుంపును ఏ విధంగా శాంతింపజేయాలో ఆయన నిర్ణయించేవాడు. చట్టప్రకారం జరగవలసింది అది. కానీ పోలీసులు దాన్ని ఖాతరు చేయకుండ తామే కాల్పులు జరిపారు. బలిజ మల్లేశు అక్కడికక్కడే చనిపోగా 9 మంది గాయపడ్డారు. ఎస్.ఐ.సీ, సి.ఐ.సీ ప్రభుత్వం ఏమీ చేయలేదుగానీ గ్రామంలోని ముస్లింలు పట్టుకు భయపడి ఊరొదిలి పారిపోయారు,

## నర్మెట్ట [వరంగల్ జిల్లా]

ఇంద్రవెల్లి, టంగుటూరు కాల్పుల తరువాత రాష్ట్రంలో ప్రజల దృష్టిని మళ్ళీ అంతగా ఆకర్షించినవి నర్మెట్ట కాల్పులు. డిసెంబర్ 5వ తేదీ సాయంత్రం 3-30 లేక 4 గంటల ప్రాంతంలో నర్మెట్ట పోలీస్ స్టేషన్ బయట ధర్నా చేస్తున్న దాదాపు 500 మంది స్త్రీ-పురుషులూ పిల్లలమీద పోలీసులు 27 రౌండ్లు కాల్పులు జరిపారు. చనిపోయింది ఇద్దరేనని పోలీసులంటున్నారు. 10 నుండి 20 దాకా చని పోయారని రాడికల్ యువజనసంఘం జిల్లాశాఖ అంటుంది. అయితే వాళ్ళు ఎవరో ఏ ఊరివారో వాళ్ళ శవాలు ఏమయ్యాయో తెలియదు. పూర్తి వాస్తవాలు బయట పడడానికి ఇంకొంతకాలం పడుతుంది.

నర్మెట్ట పోలీస్ స్టేషన్‌కు రవికుమార్ అనే ఎస్.ఐ రావడంతో కథ ప్రారంభం అవుతుంది. ఇతను తానొక హీరో అనుకొంటాడు. రివాల్వర్‌ను చేతిలో గిరగిర తిప్పుతూ మాట్లాడతాడు. స్త్రీలను చాలా అసభ్యకరమైన మాటలతో దూషిస్తాడు. అసలు ప్రజలతో ఎన్నడూ మర్యాదగా మాట్లాడడు. ప్రజాప్రతినిధులతోనూ అంతే. గతంలో ఒక దశలో ఇక భరించలేక ప్రజలు నర్మెట్ట పోలీస్ స్టేషన్ బయట ధర్నాచేసి రవికుమార్‌ను బయటికి రప్పించి క్షమాపణ చెప్పించారు. నర్మెట్టమండల సర్పంచ్‌లు అత్యవసర సమావేశంలో రవికుమార్ ప్రవర్తనను ఖండిస్తూ తీర్మానం చేశారు.

ఈ రవికుమార్ డిసెంబరు 4వ తేదీ ఉదయం నర్మెట్టలోనే జిల్లా రాడికల్ యువజనసంఘం కార్యదర్శి చంద్రమౌళిని అరెస్టు చేశాడు. ఎందుకు చేశావని

అడిగితే అతనిదగ్గర బాంబు దొరికిందంటాడు. అయితే బాంబు (అసలు దొరికి వుంటే) అరెస్టు చేసిన తరువాత దొరికిందికదా— అది అరెస్టుకు కారణం ఎట్లా అవుతుంది? అరెస్టుకు కారణం తాను హీరోనని రుజువు చేసుకోవాలనే కోరికేతప్ప వేరే ఏదీ కాదు.

చంద్రమౌళి అరెస్టు కాగానే రాడికల్స్ పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగులనూ, ప్రజాప్రతినిధులనూ కిడ్నాప్ చేయడం మొదలుపెట్టారు. ఆ ఒత్తిడి ఫలితంగా ఆ రోజు సాయంత్రమే పోలీసులు చంద్రమౌళిని రిమాండుచేసి టాడా కేసు పెట్టారు. కిడ్నాప్‌లతోబాటు పోలీస్‌స్టేషన్ బయట ధర్నాకూడ ఆరోజు సాయంత్రం జరిగింది. కోర్టులో హాజరుపెట్టాము కాబట్టి ఇంక ఆందోళన జరగదులెమ్మని పోలీసులు అనుకున్నారు. అయితే డిసెంబర్ 5వ తేదీన చంద్రమౌళిమీద పెట్టినది తప్పుడు కేసు కాబట్టి కేసు ఎత్తివేసి అతనిని బేషరతుగా విడుదల చేయాలంటూ పోలీస్ స్టేషన్ బయట జనం ధర్నా ప్రారంభించారు స్త్రీలూ, స్కూలుపిల్లలూ, మగవాళ్ళు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు. పాటలు పాడారు. నినాదాలు ఇచ్చారు. ఎస్.ఐ. రవికుమార్ తిట్టిన తిట్లన్నీ తిరిగి అప్పజెప్పారు. ధర్నాలో పాల్గొన్న వారి సంఖ్య 5000 ఉంటుందని పోలీసులే అంటున్నారు.

అక్కడ వరంగల్ కోర్టులో చంద్రమౌళి విడుదల కోసం బెయిల్ పిటిషన్ వేయడానికి నర్మెట్ట మండలం సర్పంచ్‌లంతా ప్రయత్నించసాగారు. ప్రభుత్వ న్యాయవాది సరేనంటే బెయిల్ ఇస్తానని న్యాయమూర్తి అంటాడు గానీ ప్రభుత్వ న్యాయవాదికి సరేననవద్దని జిల్లా పోలీసుల నుండి ఆదేశం వుంది. జిల్లా ఎస్.పి.ని కలిసి ఒప్పించడానికి సర్పంచ్‌లు ప్రయత్నించగా ఆయన ముఖంచాటు చేసుకుంటాడు. కలెక్టరూ అంతే. చివరికి 5వ తేదీ మధ్యాహ్నం బెయిలు మంజూరు అయి రిలీజ్ ఆర్డర్‌తో సర్పంచ్‌లు జైలు దగ్గరికి పోగా పోలీసులు ఇంకొక వారంట్‌తో ప్రత్యక్షమయి ఇంకొక కేసుందంటారు.

ఇక్కడ నర్మెట్టలో ధర్నా చేస్తున్న జనంలో అసహనం బాగా పెరిగి పోతుంది. మధ్యాహ్నం 1-30 కు జిల్లా ఓఎస్‌డి రాజిరెడ్డి నర్మెట్ట చేరుకుంటాడు. 3 గంటల సమయంలో జనంలో నుండి కొందరు స్టేషన్ నుండి బయటికొచ్చిన డి.ఎస్.పి జీపు డ్రైవర్ భుజం పట్టుకొని పక్కకు తీసుకుపోతారు. అదే సమ

యంలో రాడికల్స్ పోలరైజేషన్ మీద కాల్పులు ప్రారంభించారని డి.ఎస్.పి. సుందరకుమార్ దాస్ అంటాడు గానీ అది పచ్చి అబద్ధం. జనం నుండి ఎవ్వరూ కాల్పులు జరపలేదని రాడికల్స్ సానుభూతి పరులేకాదు, వాళ్ళ వ్యతిరేకులు కూడ ఒప్పుకుంటున్నారు. అయితే జీపు డ్రైవర్ అపహరణ మట్టుకు వాస్తవం. దానితో డి.ఎస్.పి కాల్పులు జరపమని విజిల్ వేసాడు. పోలీసులు ఏకసమయంలో బాష్ప వాయువు ప్రయోగించి జనంలోకి కాల్పులు జరిపారు. పావు గంటసేపు కాల్పులు జరిగాయి. చాలా మంది గాయపడి క్రిందపడ్డారు. 10 మందిదాకా చనిపోయారని మొదట పోలీసులే అన్నారు. నర్మెట్ట నుండి వరంగల్‌కు వచ్చిన వైర్‌లెస్ సందేశంలో ఆ మాటే వినవచ్చింది.

గాయపడి అక్కడే పడిపోయిన వారిని పోలీసులు వ్యాన్‌లో ఎక్కించి వరంగల్ ఎం.జి.ఎం ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడికి వచ్చేసరికి ఇద్దరు చనిపోయి వున్నారు. వారిలో ఒకరను గండి రామారం గ్రామం కిందనున్న దొంగల చెలిమితండాకు చెందిన భూక్యాలక్ష్మి అనే స్కూలు విద్యార్థి కాగా రెండవ అతనిని మొదట నర్మెట్టకు చెందిన రమేష్‌గా గుర్తించారు. తరువాత అతను ఇప్పలగడ్డ నివాసి అయిన ఇట్టబోయిన సిద్దయ్య అనే 9 వ తరగతి విద్యార్థి అని గుర్తించారు. అయితే పోలీసులు మట్టుకు మూడు పేర్లూరాసుకున్నారు. అందుకే చనిపోయిన వారు ఇద్దరని కొంతసేపూ ముగ్గురని కొంతసేపూ అంటూ వచ్చారు. నాలుగు రోజుల దాకా జిల్లా ఎస్.పి. కోటేశ్వరరావుగారు చనిపోయింది రమేశ్ అనే అంటూ వచ్చాడు. చివరికి 9 వ తేదీన పౌరహక్కుల సంఘం బాధ్యులు నర్మెట్ట మండలంలో పర్యటించిన తరువాత ఆయనను కలిసి రమేష్ సజీవంగానే ఉన్నాడనీ చనిపోయింది సిద్దయ్య అనీ చెప్పగా అప్పుడు తన ఫైల్ దిద్దుకున్నాడు! ఇంత అజాగ్రత్తగా ఉన్నవాళ్ల చనిపోయిన వారి సంఖ్య మట్టుకు సరిగ్గా చెప్తారని నమ్మకం ఏముంది ?

పోలీసులు ఆస్పత్రికి తరలించినవారేకాక, వేరే చాలామంది బుల్లెట్ గాయాలు తగిలిన వాళ్ళు పారిపోయి పొలాలలో పడి చనిపోయారని జనం నమ్ముతున్నారు. అయితే అట్లాపడిపోయిన వాళ్ళను 'ఫలానా వ్యక్తి చూసాడు' అనే వాళ్ళే తప్ప 'నేను చూసాను' అంటున్న వాళ్ళెవరూలేరు 'ఫలానా గ్రామంలో ఎవరో చనిపోయారంట' అంటారు గానీ ఆ గ్రామంలో అడిగితే ఇక్కడెవ్వరూ

చనిపోలేదని అంటున్నారు. మొత్తానికి కొంత కాలం అయితేగానీ ఈ ఇద్దరు కాక ఇంకెవరయినా చనిపోయారేమో తెలీదు. డిసెంబర్ 5 వ తేదీన నర్మెట్టలో పశువుల సంత వున్న కారణంగా దూరప్రాంత జనం అక్కడికి వచ్చి ఉండే అవకాశం వుంది.

డిసెంబర్ 6 వ తేదీన మొదలుపెట్టి నర్మెట్టను కేంద్రంగా చేసుకొని స్పెషల్ పోలీసులు ఆ మండలంలోని అన్ని గ్రామాల మీదా దాడులు చేస్తున్నారు. ముఖాలకు ముసుగులు వేసుకొని ఇళ్ళలోకి దూరి జనాన్ని కొడుతున్నారు. బండ బూతులు తిడుతున్నారు. ఒక్కొక్కరినీ అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌మీద దాడిచేసారని (ధర్నాకు ఇది పోలీసులు పెట్టుకున్న పేరు) కేసుపెడుతున్నారు.

## అచ్చంపేట, కొల్లాపూర్ [మహబూబ్‌నగర్ జిల్లా]

డిసెంబర్ 20 వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేటలోనూ కొల్లాపూర్‌లోనూ
చాలా మంది గాయపడ్డారు.

అచ్చంపేటలో 20 తేదీన తలపెట్టిన రైతుకూలీ సంఘం బహిరంగసభను ఎట్టిపరిస్థితులలోనూ జరగనివ్వకూడదన్న పోలీసుల పంతమే ఈకాల్పులకుదారితీసింది. కాల్పులు జరగవలసిన అగత్యం అచ్చంపేటలోగానీ కొల్లాపూర్‌లోగానీ ఉండలేదు. కానీ కాల్పులు జరిపి బీభత్సం సృష్టించాలనీ ప్రజలను భయభ్రాంతులను చేయాలనీ కృతనిశ్చయులయి పోలీసులు కాల్పులు జరిపారు. కాల్పులకు కారణం ప్రజల్పు పోలీసులమీద చేసిన దాడేనని చెప్పి ప్రజలను వందల సంఖ్యలో ముద్దాయిలను చేసి సోదాల పేరిట వేధించడం మొదలు పెట్టారు. ఇది రాజకీయ అణచివేతే తప్ప శాంతి భద్రతల పరిరక్షణ ఎంత మాత్రం కాదు.

విప్లవ గ్రూపులకు సంబంధించిన ప్రజాసంఘాల కార్యక్రమాలను ఇకపై సాగనివ్వకూడదనే నిర్ణయానికి అధికార యంత్రాంగం వచ్చిందనే విషయం అచ్చంపేట కాల్పులతో స్పష్టం అయింది. నిజానికి చెన్నారెడ్డి హయాంలో అయన

గారు ఆఖరిసారి తెలంగాణ జిల్లాల కలెక్టర్లనూ ఎస్.పి లను సమావేశపరచి మాట్లాడినప్పుడు తీవ్రవాదులపైన ఉక్కుపాదం మోపమని ఆదేశించినట్టు తెలుస్తూవుంది. కొత్త ప్రభుత్వంలో అది కొనసాగుతూవుంది. అచ్చంపేటలో డిసెంబర్ 20 వ తేదీన బహిరంగ సభకు అనుమతి ఇవ్వమని 8 వ తేదీన జిల్లా రైతుకూలీ సంఘం తరఫున నాగర్ కర్నూల్ డి.ఎస్.పి.కి జిల్లా కలెక్టర్‌కూ అప్లికేషన్లు ఇచ్చారు. అయితే పోలీసులు వెంటనే రంగంలోకి దిగి బహిరంగసభ కోసం ప్రచారం చేస్తున్నవారిని అరెస్టు చేయసాగారు. పోస్టర్లు అంటిస్తూ తిరుగుతూవున్న కృష్ణారెడ్డి అనే రైతును 13 వ తేదీ ఉదయం గౌరిదేవిపల్లిలో చాలా బాహాటంగా కాల్చేసారు. అచ్చంపేటలో 144 సెక్షన్ పెడుతున్నారన్న వార్త 14 వ తేదీన పేపర్లోవచ్చింది. 17 వ తేదీన కృష్ణారెడ్డి 'ఎన్‌కౌంటర్' గురించి జిల్లా ఎస్.పి.ని ప్రశ్నించడానికి వెళ్ళిన మహబూబ్‌నగర్ జిల్లా ఏ.పి.సి.ఎల్.సి బాధ్యులతో మాట్లాడుతూ ఎస్.పి. సి.ఎస్. నాయుడుగారు అచ్చంపేటలో బహిరంగసభను ఎట్టి పరిస్థితిలోనూ జరగ నిచ్చేది లేదన్నారు 18 వ తేదీ నుంచి సభకు అనుమతి ఇవ్వాలనే డిమాండుతో రాడికల్స్ జిల్లాలో పలువురిని కిడ్నాప్ చేయటం మొదలుపెట్టారు. వాస్తవం ఇది కాగా, కిడ్నాప్‌లు చేస్తున్నారు కాబట్టి సభకు అనుమతి ఇవ్వడం లేదని డి.జి.పి. ప్రభాకరరావు అబద్ధపు ప్రకటనలు చేయసాగాడు. డిమాండ్ల సాధన కోసం కిడ్నాప్‌లు చేయడాన్ని పౌరహక్కుల సంఘం మొదటి నుండి వ్యతిరేకిస్తూవుంది. ప్రభుత్వం మీద పంతంతో అమాయకులకు ప్రాణహానీ, మానసిక క్షోభ కలిగించడం సమర్థ నీయమయిన చర్యకాదు. అయితే దానిని ఆసరా చేసుకొని పోలీసు అధికార్లు అబద్ధపు ప్రచారం చేయడం క్షమించరాని నేరం. బహిరంగసభల వంటి ప్రజా స్వామిక కార్యక్రమాలను సాగనివ్వరాదనే చట్టవ్యతిరేక నిర్ణయాన్ని కప్పిపెట్టు కోవడానికి ఈ అబద్ధాలు చెప్తున్నారు.

ఇకపోతే కాల్పుల వివరాలు ఈ విధంగా వున్నాయి.

**అచ్చంపేట :**

అచ్చంపేటకు రెండు కిలోమీటర్లు ఇవతల నాగర్‌కర్నూలు పోలిశెట్టి పల్లి శివారులో 20వ తేదీ సాయంత్రం 5 గంటలప్పుడు జిల్లా ఎస్.పి. అధ్వర్యంలో కాల్పులు జరిగాయి. అంతకు ముందు, ఆరోజు ఉదయం నుండి ఎ.పి. అచ్చం

పేటలోనే వున్నారు. మధ్యాహ్నం ప్రాంతీయ వార్తల తరువాత అచ్చంపేటలో జనాన్ని పోలీసులు విచక్షణారహితంగా కొట్టడం మొదలుపెట్టారు. అప్పటికే బస్సులలోనూ లారీలలోనూ అచ్చంపేట చేరుకున్న ప్రజలను దింపి మరీకొట్టారు. అదే సమయంలో జిల్లాలోని వివిధ గ్రామాలనుండి బస్సులలోనూ అచ్చంపేటకు వస్తూన్న ప్రజలను సోదాపేరిట ఆపికొట్టారు. కల్వకుర్తి నుండి, మన్ననూరువైపు నుండి వస్తున్న వారిని అచ్చంపేట బయట ఆపి కొట్టారు.

పెద్ద సంఖ్యలో లారీలనూ బస్సులను ఆపింది పోలిశెట్టిపల్లి దగ్గర. మధ్యాహ్నం 3 గంటల సమయం నుండి ఇది మొదలయింది. సాయంత్రం అయ్యే సరికి ఈ విధంగా ఆపేసిన జనం సంఖ్యబాగా పెరిగింది. వాళ్ళను వెనక్కి నెట్టి వేసే క్రమంలో పోలీసులు బలప్రయోగానికి పాల్పడ్డారు. దీనిని జనం ప్రతిఘటించారు. పోలీసులు జనాన్ని లాఠీలతో కొట్టగా జనం చెట్లకొమ్మలు విరిచి పోలీసులను తిరిగి కొట్టారు. అంతకు మించిన దాడి జనం పోలీసుల మీద చేయలేదు.

ఈ వార్త అచ్చంపేట చేరగానే ఎస్.పి. మరి కొందరు సాయుధ పోలీసులను వెంటబెట్టుకొని బస్సులూ లారీలూ ఆగినస్థలానికి వెళ్ళాడు. ఎస్.పి. మీద పోలీసులమీద, జనం తుపాకులతో కాల్పులు జరిపారనేది వచ్చి అబద్ధం. తమకు ఏ రకమయిన ప్రాణాపాయమూ లేకున్నా కాల్పులు జరిపి ప్రజల ప్రాణాలు తీసినందుకు వేరే సంజాయిషీ చెప్పుకోలేక పోలీసులు ఈ కథ అల్లారు.

పోలీసులు మొత్తం 40 రౌండ్లకు పైగా కాల్పులు జరిపారని ప్రజలు అంటున్నారు. ప్రజలు చెల్లా చెదరయ్యి పరుగెత్తారు. పరుగెత్తుతున్న వాళ్ళమీద కూడ పోలీసులు కాల్పులు జరపసాగారు. ఎంతమంది చనిపోయారో, ఎంతమంది గాయపడ్డారో స్పష్టంగా తెలియడంలేదు. ఇద్దరు అక్కడికక్కడే రోడ్డుమీదపడి చనిపోయారనీ, ఒక వ్యక్తిని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మరొక శవాన్ని జనం ఒక లారీలో వేసి తీసుకుపోయారని అంటున్నారు. ఇంకొక శవం తరువాతరోజు ఉదయం పక్కనేవున్న ఉడుతలగుట్టమీద కనబడిందని ప్రజలు అంటున్నారు. అంటే మొత్తం 5 మంది అచ్చంపేట సమీపంలోనే చనిపోయారు. మరి ఇద్దరిని పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వాళ్ళ పరిస్థితి ఏమిటో తెలీదు. ఈ ఇద్దరు కాక చాలామంది గాయపడినవారిని ప్రజలే తీసుకుపోయారు.

పోలిశెట్టిపల్లికి బుల్లెట్ గాయాలతో అయిదుగురు వచ్చారు. వాళ్ళలో ఇద్దరిని ఎడ్ల బండిలో జనం తీసుకుపోయారు. వాళ్ళ పరిస్థితి తెలీదు. పల్కపల్లికి 8 మంది బుల్లెట్ గాయాలతో వచ్చారు. తెల్లవారే ఎక్కడికో వెళ్ళిపోయారు. వాళ్ళ పరిస్థితి కూడ తెలీదు. గట్టుతుమ్మన, పర్వల్లి, మంగలికుంటపల్లి తదితర గ్రామాలకు కూడ జనం పారిపోయారు.

ఈ కాల్పులు చాలా నిర్దాక్షిణ్యంగా జరిపారు. తననూ ఏమీ చేయవద్దని కాళ్ళకు మొక్కుతున్న ఒక ముసలి అతని మీద కూడ పోలీసులు కాల్పులు జరిపారని తెలుస్తూవుంది. రోడ్డుమీద కాల్పులు జరిగిన తర్వాత పోలీసులు జనాన్ని దాదాపు 4 కి.మీ.లు తరిమారని తెలుస్తూవుంది. ఒక అరగంట తరువాత పెద్దగుట్ట మీది నుండి మళ్ళీ పోలీసులు కాల్పులు జరిపారని తెలుస్తూవుంది.

జిల్లాలోని చాలా గ్రామాల నుండి సభకు వెళ్ళినవాళ్ళు తిరిగి రాలేదనే ఆందోళన వినవస్తూవుంది. ఇంకొంతకాలం అయితే గానీ అచ్చంపేట కాల్పులలో ఎంతమంది చనిపోయిందీ కచ్చితంగా చెప్పలేము.

**కొల్లాపూర్ :**

అచ్చంపేటకంటే ముందే కొల్లాపూర్‌లో కాల్పులు జరిగాయి. మధ్యాహ్నం 2–3 గంటల మధ్య కొల్లాపూర్ ఎస్.ఐ. ఎల్. సి. నాయక్‌గారు ఊరి బయట వనపర్తి అడ్డరోడ్డు దగ్గర నిలబడి అచ్చంపేట సభకు పోతున్న లారీలనూ, బస్సులనూ ఆపి సోదా చేయసాగాడు. ఆయుధాలకోసం సోదా చేశానని ఆయన అన్నాడు. అతని సోదా కార్యక్రమాన్ని జనం నిరసించారు. సభకు పోకుండ ఆలస్యం చేయడానికి సోదా చేస్తున్నారని జనం అతనిని దూషించారు. ఎస్.ఐ. ఇద్దరిని అరెస్టుచేసి కొట్టుకుంటూ ఊరిలోకి తీసుకొచ్చాడు. వాళ్ళ పేర్లు రామకృష్ణ (చుక్కాయపల్లి), పెద్ద సాయన్న (అదేఊరు). వాళ్ళిద్దరినీ కొడుతూ జీపులో తీసుకొస్తుండగా వాళ్ళు కేకలు పెట్టారు. ఆ కేకలు రోడ్డుపక్కన లారీలలోవున్న జనం విన్నారు. వాళ్ళిద్దరినీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన కొద్దిసేపటికే జనం పెద్ద సంఖ్యలో స్టేషన్ ఎదుట గుమిగూడారు. దాదాపు 4 వేలమంది గుమిగూడారని

పోలీసులు అంటున్నారు. బహిరంగసభకు పోతున్నవాళ్ళను అనవసరంగా అరెస్టు చేశారంటూ వాళ్ళను విడిచిపెట్టమని గొడవ చేశారు. పోలీస్ స్టేషన్ లోపల అప్పటికే ఒక కానిస్టేబుల్ రామకృష్ణ ఛాతీకి తుపాకి గురిపెట్టి కాల్చేస్తానని బెదిరించాడు.

బయట గుమిగూడిన జనం పోలీసు జీపునూ, మోటారుసైకిల్‌నూ ఎత్తి కిందవేశారు. రాళ్ళతో కొట్టారు. తన రూంలోకి వచ్చారనీ కర్రలూ, రాళ్ళూ విసిరారనీ టెలిఫోన్ వైర్ తెంపారనీ ఎస్.ఐ. అంటున్నాడుగానీ అటువంటిదేమీ లేదని జనం అంటున్నారు. పోలీసు జీపును జనమే తగలబెట్టారని పోలీసులు అంటూండగా, పోలీసులే పడిపోయిన జీపు ట్యాంకుకు బుల్లెట్ ఫైర్ చేయగా అది తగలబడిందని జనం అంటున్నారు. ఇందులోని నిజానిజాలు విచారణలోనే తేల గలవు. అయితే పోలీసుల ప్రాణాలకు అపాయం కలిగిందనేది అబద్ధం. అంతటి పరిస్థితేమీ లేకపోయినప్పటికీ పోలీసులు కాల్పులు జరిపారు. పోలీసుల కస్టడీనుండి అప్పుడే వదిలిపెట్టిన పెదసాయన్నకూ, వీపనగండ్లకు చెందిన రాములుకూ, పాతపల్లికి చెందిన గోపాల్‌గౌడ్‌కూ గాయాలు తగిలాయి. పోలీసులు వాళ్ళ గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. అసలు ఎవరికి బుల్లెట్లు తగిలాయన్నది కూడా కొల్లాపూర్ ఎస్.ఐ.కి తెలీదు. వాళ్ళను జనమే కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకుపోయి ప్రథమ చికిత్స చేయించి అక్కడి నుండి మహబూబ్‌నగర్‌కు తీసుకు పోయారు. ప్రస్తుతం వాళ్ళు హైదరాబాద్‌లో ఉస్మానియా ఆస్పత్రిలో ఉన్నారు. వాళ్ళలో రాములు, గోపాల్‌గౌడ్‌ల పరిస్థితి సీరియస్‌గా వున్నట్టు తెలుస్తూ వుంది. మీటింగ్‌కు పెద్దసంఖ్యలో పోతున్న జనంలో నుండి ఇద్దరిని నిష్కారణంగా అరెస్టుచేసి తీసుకొస్తే గొడవకాగలదని పోలీసులకు బాగా తెలుసు. అయితే ఏదో ఒక గొడవ కల్పించి నిర్బంధం ప్రయోగించాలన్న కృతనిశ్చయంతో ఉన్నారు కాబట్టి తెలిసే ఆపని చేశారు. 1500 మంది పోలీస్‌స్టేషన్‌మీద దాడి చేశారని కొల్లాపూర్ ఎస్.ఐ. ఎఫ్.ఐ.ఆర్. రాసుకున్నాడు. దానిని ఆసరా చేసుకొని పరిసర గ్రామాలమీద దాడులు చేసి విచ్చలవిడిగా అరెస్టులు చేయడంకోసం ఇదంతా చేశారు. ఇప్పటికే కోడేరు మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన 6 మందిని అరెస్టుచేసి తీసుకొచ్చారు. వాళ్ళ ఆచూకీ తెలియడంలేదు. అచ్చంపేటలో 50మందిని అరెస్టు చేసినట్టు పోలీసులే అంటున్నారు.

బహిరంగసభలకూ ఇతర ప్రజాస్వామిక కార్యక్రమాలకూ ఆటంకం ఉండదని ప్రభుత్వాధికారులు కొంత కాలంగా ప్రకటిస్తూ ఉండబట్టి జనం వేల సంఖ్యలో జిల్లా నలుమూలల నుండి అచ్చంపేట తరలివచ్చారు. పైగా జిల్లా కలెక్టర్ కిడ్నాపులకు స్పందించి సభకి అనుమతి ఇవ్వాలని నిర్ణయించుకొని ఆ విషయాన్ని 20వ తేదీ ఉదయం ప్రాంతీయ వార్తలలో ప్రకటించారు. తరువాతే రాష్ట్ర డి.జి.పి. స్వయంగా జోక్యం చేసుకొని ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొమ్మని జిల్లా అధికార యంత్రాంగంమీద ఒత్తిడి వేశాడు. ఈ సంగతి మధ్యాహ్నం ప్రాంతీయ వార్తలలో ప్రకటించారు. అయితే అప్పటికే జనం చాలా ప్రాంతాల నుండి అచ్చంపేటకు బయలుదేరి వెళ్ళిపోయారు. అక్కడ లాఠీలకూ, తూటాలకూ బలయ్యారు. జిల్లా మేజిస్ట్రేట్ అయిన జిల్లా కలెక్టర్ నిర్ణయాన్ని కాదనగల దౌర్భాగ్యపు స్థితిలో బ్రతుకుతున్నాం మరి.

## ఖానాపూర్ [అదిలాబాద్ జిల్లా]

పాలక పార్టీలు పెంచి పోషించిన పోలీసు రాక్షసి ఖానాపూర్‌లో వాళ్ళ మనిషినే బలిగొన్నాయి. ఫిబ్రవరి 21వ తేదీ రాత్రి ఖానాపూర్ పోలీసుస్టేషన్ సెంట్రీ సత్యనారాయణ పోలీసు స్టేషన్‌లోకి మోటారు సైకిల్‌పై వచ్చిన మండల కాంగ్రెస్ (ఐ) కమిటీ ఉపాధ్యక్షుడు, పలువురు కాంగ్రెస్ (ఐ) నాయకులకు రక్తబంధువు అయిన సుకుమారరావు (వయస్సు 42) అనే మస్కాపూర్‌కు చెందిన భూస్వామిని మోటారు సైకిల్‌పైనుంచి దిగుతుండగా కాల్చేశాడు. బుల్లెట్ తల గుండాపోయి సుకుమారరావు అక్కడికక్కడే మరణించాడు.

ఒక పంచాయితీకి సంబంధించి కొంతమంది కరీంనగర్ జిల్లా ముత్యంపేట గ్రామస్థులు ఖానాపూర్ స్టేషన్‌లో అరెస్టయి ఉన్నారు. వాళ్ళని విడిపించడానికి సుకుమారరావు ప్రయత్నించాడు. ఫిబ్రవరి 21 రాత్రి ఆయన నిర్మల్ నుండి గ్రామానికి తిరిగివచ్చి, పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేశాడు. హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ ఉన్నాడు. అతను వారిని వదిలిపెట్టడానికి నిరాకరించగా, మస్తాన్ అనే డ్యూటీలో లేని మరో హెడ్ కానిస్టేబుల్ చేత సుకుమారరావు చెప్పించాడు. 'సరే రమ్మ'న్నాడు హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్. సుకుమారరావు, సురేంద్రరావు అనే ముత్యం

పేట గ్రామ పెద్దమనిషిని వెనుక కూర్చోబెట్టుకుని తన బుల్లెట్ మోటారుసైకిల్‌పై ఖానాపూర్ పోలీసుస్టేషన్‌కు వెళ్ళాడు. అప్పటికి రాత్రి తొమ్మిదైంది. వెన్నెల ఉంది. పోలీసు స్టేషన్ గేటు మీద రెండు ట్యూబ్‌లైట్లు ఉన్నాయి. సుకుమారరావుకి తప్ప ఆ మండలంలో ఎవరికీ బుల్లెట్ మోటార్ సైకిల్ లేదు. పైగా పైరవీకారుగా సుకుమారరావు పోలీసులకు చిరపరిచితుడే. అతను పోలీసుస్టేషన్ ఆవరణలోకి బండిపై ప్రవేశించి గేటు ప్రక్క ఎడమవైపునగల చెట్టు క్రింద బండి ఆపాడు. బండి మీద ఎవరు వచ్చినా అక్కడే ఆపుతారు. పోలీసుస్టేషన్ ఆవరణ బయటి గేటుకు, స్టేషన్ బిల్డింగ్‌కూ మధ్య 50 గజాల దూరం ఉంది. సెంట్రీ అక్కడి నుండి 'కౌన్ హై ?' అని ఒక్కసారి అరచి సుకుమారరావు మోటారు సైకిల్ దిగి సమాధానం చెప్పేలోపే కాల్చేశాడు. సుకుమారరావు ఆకస్మాత్తుగా స్టేషన్ ఆవరణలోనికి రావడంతో సెంట్రీ గాభరాపడి తీవ్రవాది అనుకుని కాల్చేశాడని పోలీసులు అంటున్నారుగాని అంత గాభరా పడవలసిన పరిస్థితి ఏకీ లేదు.

అసలు తప్పు పోలీసు పై అధికారులది. సెంట్రీ సత్యనారాయణ మానసిక స్థిమితం లేని వ్యక్తి. అతను చాలాసార్లు గాభరాపడి తన సహోద్యోగుల పైనే తుపాకి తీశాడు. దీనికి కారణం రెండు మూడేళ్ళ క్రితం నక్సలైట్లు అల్లంపల్లి లోను, రాచోంలలోనూ మందుపాతర పెట్టి పోలీసు జీపును పేల్చేసినప్పుడు రెండు సార్లూ ఆ జీపులో ఉండి ప్రాణాలతో బయటపడిన వ్యక్తి సత్యనారాయణ. అప్పటి నుంచీ అతనికి మానసిక స్థిమితం లేదు. అటువంటి వ్యక్తికి సెంట్రీ డ్యూటీ వేయడం పై అధికారులదే తప్పు. దాని పర్యవసానంగా సుకుమారరావు ప్రాణం పోయింది. తేలుకుట్టిన దొంగలలాగా కాంగ్రెస్ నాయకులు కిమ్మనకుండా ఊరు కున్నారు.

# పిడుగురాళ్ళ (గుంటూరు జిల్లా)

మండల్ కమిషన్ నివేదిక అమలు తదితర కోర్కెల సాధనకోసం సి.పి.ఐ (యం–యల్) 'పీపుల్స్‌వార్' పిలుపు మేరకు మార్చి 26-27 తేదీల్లో రాష్ట్రవ్యాప్త బంద్ జరిగింది. 25-26 తేదీల మధ్యరాత్రి సుమారు ఒంటిగంటకి 10 మంది రాడికల్ యువకులు పిడుగురాళ్ళలోని గుంటూరు రైల్వేలెవెల్ క్రాసింగ్ తలుపులు వేసి తాళం తీసుకొని వెళ్ళిపోయారు. సుమారు 2 గంటల ప్రాంతంలో పెట్రోలింగ్ జీపులో వచ్చిన స్థానిక ఎస్. ఐ. షేక్ ఖాసిం, స్థానిక పోలీసులు రైల్వే గేటును ఊడదీసి పక్కన పడేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఆ తర్వాత కొంత సేపటికి సుమారు 4 గంటలకు రాడికల్ యువకులు తిరిగి అదే స్థలానికి వచ్చారు. తాము తాళం వేసిన రైలుగేటును ఊడదీసి ఉంచడం చూసి తిరిగి దాన్ని మూసివేశారు. ఇంతలో మాచర్ల వైపునుంచి ఒక ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. బస్ వచ్చి ఆగగా దాని అద్దాలు పగులగొట్టారు. అదే సమయంలో మరో ఆర్.టి.సి. బస్ మాచర్లవైపునుంచే వచ్చి ఆగింది. దాన్ని వెనక్కు తిప్పి తీసుకెళ్ళే ప్రయత్నంలో ఉండగా దాన్ని ఆపేందుకు రోడ్డుమీద ఒక బాంబు పేల్చారు. మరో బాంబును బస్ ముందు భాగంలో వేయగా డ్రైవర్ బస్‌ను ఆపాడు. ప్రయాణీకులు దిగిపోయారు. ఆ బస్ అద్దాలు పగులగొడుతున్న సమయంలో బస్ వెనుకవైపు పోలీసులు 20గజాల దూరంలో పొంచివున్న స్థానిక పోలీసులు, ఎస్.ఐ. షేక్‌ఖాసిం నాయకత్వంలో కాల్పులు జరిపారు. గాలిలోకి కాల్పులు జరపకుండా నేరుగా రాడికల్స్‌వైపు కాల్పులు ప్రారంభించడంతో ఊహించని పరిణామం ఎదురైన రాడికల్స్ పారిపోవడం ప్రారంభించారు. పారిపోతున్న రాడికల్స్‌పైకి పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో ఇనుముక్కల జయపాల్ (23) ఉరఫ్ జార్జికి వీపువైపునుంచి గుండు దూసుకుపోగా తీవ్రంగా గాయపడ్డాడు. బుల్లెట్ వీపువైపు నుంచి బొడ్డుకు ఒక అంగుళం పైనుంచి దూసుకుపోయింది. జార్జికి ఒక కాలు

అవుడు కాబట్టి పరిగెత్తడంలో వెనుకబడిన ఫలితంగా అతనికి గుండుదెబ్బ తగిలింది.

దెబ్బతిన్న జార్జి కొంతదూరం పరిగెట్టి రోడ్డుకు షుమారు 60 గజాల దూరంలో ఒక చొప్పదొడ్డిలో పడిపోయాడు.

ఉదయం 6 గంటలకు కాలకృత్యాలు తీర్చుకొనేందుకు వెళ్ళిన కొందరు స్త్రీలు అతన్ని చూశారు. అతను దాహం వేస్తుందని మంచినీళ్ళు పోయమని, ఆస్పత్రికి తీసుకువెళ్ళమని అక్కడి ప్రజలను ప్రాధేయపడ్డాడు. పోలీసులకు సమాచారం అంది స్థానిక ఎస్.ఐ, పోలీసులు ఉదయం ఆరున్నర గంటలకు అక్కడికి వచ్చారు. జార్జి చావుబతుకుల మధ్య ఉండగా అతన్ని ఆస్పత్రిలో చేర్చే ప్రయత్నం ఏమీ చేయకుండా అక్కడే అతనిని ఇంటరాగేట్ చేయడం ప్రారంభించారు. గంటకుపైగా ఇంటరాగేట్ చేసారు. తనను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్ళి బతికించమని జార్జి ఎస్.ఐ.ని ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. అత్త (పిడుగురాళ్ళ నివాసి)కు విషయం తెలిసి అక్కడికి వచ్చినా అతనితో మాట్లాడేందుకు పోలీసులు అనుమతించలేదు. షుమారు 8 గంటలకు పోలీసులు జార్జిని ఒక రిక్షాలో పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి కొంత సేపటికి పిడుగురాళ్ళలోని ఒక ప్రైవేట్ నర్సింగ్‌హోంకు తీసుకువెళ్ళగా అక్కడి డాక్టర్ జార్జి మరణించినట్టు ప్రకటించారు.

మృతదేహాన్ని ఉదయం 9–30 గంటల వరకు స్టేషన్ ఆవరణలో ఉంచి ఆ తర్వాత గుంటూరు ప్రభుత్వాసుపత్రి కాజువాలిటీకి తరలించారు. మృతదేహాన్ని పిడుగురాళ్ళ నుంచి తరలించి, పిడుగురాళ్ళలో శవపంచనామా చేయకుండా గుంటూరులోనే శవపంచనామా చేయించేందుకు పోలీసులు శవాన్ని గుంటూరుకు తెచ్చారు. గుంటూరు ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో చనిపోయాడన్నట్టుగా కట్టుకథఅల్లి క్యాజువాలిటీకి షుమారు 11-30 A.M.కు తెచ్చారు. అక్కడి డాక్టర్స్ యధావిధిగా మరణించినట్లు అధికారకంగా ప్రకటించగా మార్చురీకి తరలించారు.

వాస్తవాలు పై విధంగా వుంటే పోలీసులు ఎప్పటిలాగే ఓ ఎన్‌కౌంటర్

కట్టుకథ అల్లారు. పోలీసులపై రాడికల్స్ బాంబులు వేస్తుంటే ఆత్మరక్షణ కోసం బస్‌లో వున్న ఎస్కార్టు పోలీసులు కాల్పులు జరిపారని కొందరికి రివార్డులు ప్రకటించారు. ఎస్కార్టు పోలీసులు అని ప్రకటించి పోలీసులు తాము అకస్మాత్తుగా కాల్పులు జరిపారనేదాన్ని సమర్థించుకోజూస్తున్నారు.

కానీ వాస్తవానికి ఆ సంఘటన సమయంలో అక్కడ ఆపబడ్డ రెండు బస్సుల్లోను ఎస్కార్టు పోలీసులు లేరు. కాల్పులు జరిపింది స్థానిక ఎస్.ఐ. ఖాసిం నాయకత్వంలో స్థానిక పోలీసు పార్టీనే. వారు బస్ వెనుక కొద్ది దూరంలో పొంచి వుండి ఎలాంటి ముందు హెచ్చరికలు లేకుండా నేరుగా కాల్పులు ప్రారంభించి పారిపోతున్న వారిలో ఒకరిని బలిదీసుకున్నారు. తుపాకీ తూటా వీపులో నుంచి దూసుకుపోవడం పారిపోతుండగా కాల్చి చంపబడ్డాడని స్పష్టంగా తెలియజేస్తుంది.

★

# పోలీసు కాల్పుల జాబితా

| ఊరు | కాల్పులు జరిగిన తేదీ | మృతులు, గాయపడినవారు | కారణం |
|---|---|---|---|
| 1. పడ్కల్ | 3-3-90 | 2(1) | కరెంటు సరఫరాకై రైతుల ఆందోళన |
| 2. నగరి | 15-3-90 | 3(8) | గూండాలకు హరిజనులకు మధ్య జరిగిన కొట్లాట |
| 3. బాన్స్‌వాడ | 20-4-90 | 6(16) | కుస్తీపోటీల తగాదా |
| 4. ఇడిమేపల్లి | 6-5-90 | 3 | గ్రామ తగాదాలు |
| 5. అప్పాపురం | 18-5-90 | 2 | తుపాన్ సహాయ పంపిణీలో అక్రమాలు |
| 6. నందివడ్డెమాను | 7-6-90 | 2(4) | కల్లుధర తగ్గింపుకై ఆందోళన |
| 7. కమలాపూర్ | 11-6-90 | 1(12) | యువతిపై కానిస్టేబుల్ అత్యాచారం |
| 8. కొల్లాపూర్ | 20-6-90 | 1 | బంద్ సందర్భంగా రాడికల్స్‌పై కాల్పులు |
| 9. గొట్టిపడియ | 2-8-90 | 1(3) | పీర్ల పండగ ఘర్షణ |
| 10. పావగల్లు | సెప్టెంబర్ | 1(1) | చేతబడి పంచాయతీ |
| 11. ఖిలాఘనపురం | 9-11-90 | 1(9) | మత వైషమ్యాలు |
| 12. నర్మెట్ట | 5-12-90 | 2(అనేకులు) | ఆర్.వై.ఎల్. కార్యకర్త అరెస్టు |
| 13. అచ్చంపేట, కొల్లాపూర్ | 20-12-90 | 5(కనీసం 18 మంది) | రైతుకూలీ సభల విచ్ఛిన్న యత్నం |
| 14. ఖానాపూర్ | 21-2-91 | 1 | మతిస్థిమితం లేని సెంట్రీ |
| 15. పిడుగురాళ్ళ | 26-3-91 | 1 | పీపుల్స్‌వార్ బంద్‌నాడు బస్సులపై జరిగిన దాడి |

**POLICE KALPULU : Chattam, Acharana** **Rs. 3/-**

'పోలీసులకు తుపాకులిచ్చింది ఎందుకు - కాల్పులు జరపడానికి కాకపోతే' అని అమాయకంగా ప్రశ్నించే దశనుండి విచ్చలవిడిగా జరుగుతున్న పోలీసు కాల్పులను ప్రశ్నించేదాకా ప్రజలు ఎదిగారు. 'తుపాకీ తూటాకు చట్టం తెలుస్తుందా' అని అహంకారంగా జవాబు చెప్పే దశనుండి నిజమో అబద్ధమో ఒక కథ అల్లే స్థితికి పోలీసులూ ఎదిగారు.

తూటాకు చట్టం తెలీదు. కానీ దాన్ని కాల్చేవాడికి తెలియాలి. తూటాకు నియమాలుండవు. కానీ దాన్ని కాల్చేవాడికి నియమాలుంటాయి. ఆ చట్టాన్నీ నియమాలనూ అలక్ష్యం చేస్తే దానికి శిక్ష ఉండాలి.

... ... ... ...

నలుగురికంటే ఎక్కువమంది ఒక చోట గుమిగూడితే, ఆ సమావేశం చట్టవ్యతిరేక సమావేశమయినా, లేక సామాజిక శాంతికి భంగం కలిగించేటట్లున్నా, ఆ సమావేశాన్ని వెంటనే చెదిరిపొమ్మని ఆదేశం ఇచ్చే అధికారం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటుకు, పోలీసు స్టేషన్ అధిపతికీ, ఎస్. ఐ. హోదాకు తక్కువకాని పోలీసు ఆఫీసర్‌కు ఉందని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 129 (1) అంటుంది.

అయితే ఇద్దరు, ముగ్గురి మీద సహితం కాల్పులు జరిపిన సంఘటనలు, కానిస్టేబుళ్ళ స్వంత నిర్ణయంమీద కాల్పులకు పాల్పడిన సంఘటనలూ అనేకం ఉన్నాయి. ఈ పుస్తకంలో గత ఏణ్ణర్థంలో రాష్ట్రంలో జరిగిన అన్ని పోలీసుకాల్పుల రిపోర్టులూ ఉన్నాయి. వాటిలో ఈ కోవకు చెందినవి చాలా ఉన్నాయి. వాటిని పోలీసులు ఏ చట్టం కింద సమర్థించుకుంటున్నారో ఆ వివరాలు కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి.